


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575


అక్షర
# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
www.rajamudranews.com
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 12.07.2025 | సంపుటి : 2 | సంచిక :159 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | Saturday | 12.07.2025 | volume : 2 | Issue : 159 | Pages : 8 | Cost : 2/-

విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



04

## జన్మతః పౌరసత్వ హక్కుపై ట్రంప్ ఆదేశాల నిలిపివేత



## టిటిడిలో అన్యమత ఉద్యోగులను తొలగించాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్

04



2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ దార్శనికత దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి అమెరికన్ల మద్దతు కావాలని కోరారు. హైదరాబాద్‌లోని ఓ హొటల్‌లో శుక్రవారం అమెరికా 249ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం 'ది ఛార్జ్ డీ ఎఫైర్స్' జోర్గాన్ ఆండ్రూస్, హైదరాబాద్ అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా స్ఫూర్తితో తెలంగాణలో అభివృద్ధి

- రాష్ట్రం, అమెరికా మధ్య సారూప్యతలెన్నో..
- 2035 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- అమెరికా నుంచి అధిక పెట్టుబడులు రావాలి
- అమెరికా స్వాతంత్ర్య వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 11 :
అమెరికాకు, తెలంగాణ రాష్ట్రానికి మధ్య ఎంతో సారూప్యత ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఓటమిని అంగీకరించకుండా, ఎప్పుడూ బలమైన దేశంగా అనేక అంశాల్లో అమెరికా సానుకూల మార్గంలో పరిష్కారాలను చూపిందని చెప్పారు. తెలంగాణ కూడా అదే స్ఫూర్తితో పనిచేస్తూ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. హొటల్ తాజ్‌కృష్ణలో శుక్రవారం జరిగిన అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమెరికా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యానికి మార్గదర్శిగా, నిరంతర ఆవిష్కరణలతో అమెరికా.. ప్రపంచ దృక్కోణాన్ని మార్చిందని చెప్పారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్‌లో అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఏర్పాటైందని గుర్తుచేశారు. భారతదేశంతో దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో అమెరికా ఎంతో నిబద్ధతను ప్రదర్శించిందని, తెలుగు ప్రజలతో స్నేహపూర్వక బంధాన్ని కలిగి ఉందని చెప్పారు.

మిగతా 2 లో



04

## రష్యా నుంచి చమురు దిగుమతులు

ఓ రకంగా ప్రపంచ ఆర్థికానికి మేలు జరిగింది
కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి

## భారత్‌కు నష్టం కలిగిందనే ఒక్క ఆధారం చూపండి

అజిత్ దోభాల్ సవాల్



06

'ఆపరేషన్ సింధూర్' సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ ఆగ్రహం వ్యక్తం చేశా రు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు. చైన్నైలోని ఓ కార్యక్రమానికి హాజరైన దోభాల్ మాట్లాడుతూ.. ఆపరే షన్ సింధూర్‌లో భారత సై న్యం పాక్‌లోని ఉగ్రస్థావరాల ను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు.

# యూనివర్సిటీల్లో పెత్తనానికి కేంద్రం యత్నం

- రోహిత్ వేములను అడ్డుకున్న వారికి అందలం
- బెదిరింపులకు పాల్పడ్డ రామచంద్రరావుకు బిజెపి పదవి
- దళితులు, ఆదివాసీలను అణగదొక్కేవారికి పదవులు
- ఢిల్లీలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన రామచందర్ రావును తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుపై డిప్యూటీ-సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం నాడు దిల్లీలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను భాజపా ప్రభుత్వం హరిస్తోందన్నారు. ఆయనకు ఆ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం పునరాలోచన చేయాలన్నారు.



03

## బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ ప్రకటన

రైల్‌రోకో వాయిదా వేస్తున్నట్లు కవిత వెల్లడి



03

## ప్రశాంత వాతావరణంలో బోనాలు

ఉజ్జయిని బోనాలపై తలసాని సమీక్ష
13న సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు



## మరోమారు కాళేశ్వరం కమిషన్ ముందుకు హరీష్ రావు

- కేబినేట్ నిర్ణయాలు.. అసెంబ్లీ ఆమోదించిన వివరాలు అందచేత
- కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తప్పులతడక
- విమర్శలు గుప్పించిన మాజీమంత్రి

కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు విచారణకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం హాజరయ్యారు. బీఆర్‌కే భవన్‌లో మరోసారి పీసీ ఘోష్ కమిషన్‌ను హరీష్‌రావు కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మరింత అదనపు సమాచారాన్ని ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఆరుసార్లు కేబినెట్ ఆమోదం పొందిందని గుర్తుచేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అసెంబ్లీలో కూడా మూడుసార్లు ఆమోదించారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు.

# అక్కడ కేజీ చక్కెర రూ.7వేలు..

## లీటర్ పెట్రోల్ రూ.2 వేలు

ఇజ్రాయెల్ చేస్తున్న భీకర యుద్ధంతో ఆర్థికంగా కుదేలైన గాజాలో పరిస్థితులు దారుణంగా మారినట్లు తెలుస్తోంది. ఆహా రం, ఇంధనం, ఔషధాల కొరత ఎదుర్కొంటున్న పాలస్తీని యన్లకు కరెన్సీ కష్టాలు తీవ్రమయ్యాయి. యుద్ధం నేపథ్యంలో అక్కడి బ్యాంకులు, ఏటీఎంలు పనిచేయకుండా పోవడంతో తాజా పరిస్థితి తలెత్తింది. రోజువారీ ఖర్చులకు అవసరమైన నగదు కోసం మధ్యవర్తులను ఆశ్రయించాల్సి వస్తోంది.




06



02

## 'ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు'

మంత్రి పొంగులేటి



04

## రుణ చెల్లింపుపై వివాదం..

భార్య ముక్కు కొరికిన భర్త



03

రాజాసింగ్ రాజీనామా

## ఆమోదించిన భాజపా

నా చివరి శ్వాస వరకు హిందుత్వం కోసమే పనిచేస్తా : రాజాసింగ్



# ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన 22 మంది మావోయిస్టులు

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో 22 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిలో 14 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నారు. బస్తర్ డివిజన్‌లో భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం వల్ల ప్రభావితమై పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. ఈ క్రమంలోనే నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ ప్రాంతంలో చురుగ్గా ఉన్న 22 మంది గురువారం ఎస్పీ రాబిన్సన్ గుడియా ముందు లొంగిపోయారు. వీరిలో కుతుల్ ఏరియా కమిటీ కమాండర్ సుఖ్‌లాల్ కూడా ఉన్నారు. ఈ విషయాన్ని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఈ 22 మంది మావోయి స్టులపై మొత్తం రూ.37 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు.

# అమెరికా స్ఫూర్తితో తెలంగాణలో అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ రెండు దేశాల సంస్కృతుల మధ్య, ప్రజల మధ్య సంబంధాలను పటిష్ఠపర్చడంలో వారధిగా నిలుస్తున్నారని అభినందించారు. ఐటీ, ఫార్మా, రక్షణ, తయారీ, ఏరోస్పేస్ వంటి రంగాలకు చెందిన దాదాపు 200 అమెరికా కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయని చెప్పారు. తెలంగాణను 2035 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి, తెలంగాణ రైజింగ్ దార్శనికతకు తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ఇందుకు అమెరికన్ల మద్దతు కూడా కావాలని సీఎం కోరారు. జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసం, విలువల ఆధారంగా అమెరికా-భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వా మ్యం కొనసాగుతోందని చెప్పారు. 'ఒక్కటిగా ఉంటే మరింత బలంగా ఎదగగలమని నేను నమ్ముతా. హైదరాబాద్ మరింత పురోభివృద్ధి సాధించాలని, అమెరికా నుంచి తెలంగాణకు అత్యధిక పెట్టుబడులు రావాలని కోరుకుంటున్నా' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. "అమెరికా సంయుక్త రాష్ట్రాలకు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ప్రపంచం పూర్తిగా మారిపోయింది. ముఖ్యంగా ప్రజాస్వామ్యానికి మార్గదర్శి.. నిరంతరం ఆవిష్కరణలను అందించడమనే అంశాల్లో అమెరికా ప్రపంచ దృక్కోణాన్ని మార్చింది. ఓటమిని ఎప్పుడూ అంగీకరించని స్ఫూర్తి అమెరికాది. స్ఫూర్తిలో అమెరికాకు, తెలంగాణకు ఎంతో సారూప్యత ఉంది. స్నేహాన్ని కోరుకోవడం, బంధాన్ని మరింత పటిష్ఠపరుచుకోవడం తెలంగాణ ప్రత్యేకత. 2008లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఏర్పాటైంది. భారతదేశంతో దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరుచుకోవడంలో అమెరికా ఎంతో నిబద్ధతను ప్రదర్శించింది. అమెరికాతో తెలుగు ప్రజలకు ఉన్న స్నేహబంధం ఎంతో బలమైంది. అమెరికాలో తెలుగు భాష వేగంగా అభివృద్ధి చెందుతోంది. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ రెండు సంస్కృతుల మధ్య, ప్రజల మధ్య వాణిజ్యపరమైన సంబంధాలను పటిష్ఠపరచడంలో ఇరు దేశాల మధ్య బలమైన వారధిగా నిలుస్తున్నారు. ఐటీ, ఫార్మా, డిఫెన్స్, మాన్యుఫాక్చరింగ్, ఏరోసేస్ వంటి రంగాలకు చెందిన దాదాపు 200 అమెరికా కంపెనీలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. అమెరికా-తెలంగాణల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత మెరుగుపరచ డానికి మేం ప్రయత్నిస్తున్నాం. అమెరికాలోని అత్యుత్తమమైన సంస్థలను తెలంగాణకు తీసుకొస్తారని ఆశిస్తున్నా. ఈ వేడుకలకు థీమ్‌గా నిర్దేశించినట్టుగా చెప్పాలంటే.. 'ఒక్కటిగా ఉంటే.. మరింత పటిష్ఠం గా..' ఎదగగలమని విశ్వసిస్తున్నా" అని పేర్కొన్నారు.



## బీసీ బిల్లును వ్యతిరేకిస్తే న్యాయపరంగా పోరాడాలి

### సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన బీసీ సంఘాలు

**హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ఎవరైనా కోర్టుల్లో సవాల్ చేస్తే న్యాయపరంగా ప్రభుత్వం గట్టిగా పోరాడాలని బీసీ సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారని ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ వర్గాల కోసం చేసే పోరాటంలో తమకు అండగా నిలవాలని బీసీ సంఘాల నేతలను సీఎం కోరారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీసీ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ సంఘాల నాయకులు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వచ్చి రేవంత్‌రెడ్డిని కలిశారు. 'స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం. ఇది బీసీల పోరాట విజయం. అన్ని పార్టీలు, కులాలు, సంఘాల సహకారంతోనే ఇది సాధ్యమైంది' అని కృష్ణయ్య పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ కుల, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల సమావేశం నిర్వహించారు.

## తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మారుస్తాం

- మూడు జిల్లాల్లో ఫార్మా విలేజ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



**మాదాపూర్ :** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఈ క్రమంలోనే ఏడాదిన్నరలో రూ.50వేల కోట్లకుపైగా పెట్టుబడులు ఆకర్షించగలిగామని చెప్పారు. కొత్తగా 60వేల మందికి ఉపాధి లభించిందన్నారు. శుక్రవారం హైదరాబాద్ మాదాపూర్‌లో 'ఫార్మా టెక్ ఇన్నోవేటివ్ కాంక్లేవ్' పేరిట ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 2024-25లో రూ.66వేల కోట్ల విలువైన లైఫ్ సైన్సెస్ ఉత్పత్తులను తెలంగాణ ఎగుమతి చేసిందన్నారు. ప్రపంచానికి కావాల్సిన మూడింట ఒక వంతు వ్యాక్సిన్లను అందిస్తూ హైదరాబాద్ 'వ్యాక్సిన్ రాజధాని'గా గుర్తింపు పొందిందని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో 5 లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. ఇందుకు రూ.లక్ష కోట్లతో దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహాన్ని అమలు చేయబోతున్నట్లు చెప్పారు. అందరి అభిప్రాయాలు సేకరించి వికారాబాద్, నల్గొండ, మెదక్‌లో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

### త్వరలో లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ..

లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో త్వరలోనే 'లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ'ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ రంగంలో 'తెలంగాణ' బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకు ప్రత్యేకంగా 'తెలంగాణ కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ'కి శ్రీకారం చుట్టామని వివరించారు. ఈ రంగాన్ని పరిశ్రమలు లేదా ఆర్ అండ్ డీ సెంటర్లకే పరిమితం చేయడం లేదు.. సాంకేతికత మేళవింపుతో ప్రజలకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే మూడు జిల్లాల్లో నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లను ముందే గుర్తించేందుకు ఏఐ ఆధారిత స్క్రీనింగ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించామని చెప్పారు. సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, వైద్య కళాశాలలకు విస్తరించేందుకు సత్వర ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## 'ప్రతి మండలానికి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లు'



**హైదరాబాద్:** భూ విస్తీర్ణాన్ని అనుసరించి ప్రతి మండలానికి నాలుగు నుంచి ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించ నున్నట్లు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 'శిక్షణలో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఈ నెల 27న తుది పరీక్ష నిర్వహిస్తాం. 28, 29వ తేదీల్లో జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించి వచ్చే నెల 12న ఫలితాలు ప్రకటిస్తాం. ఎంపికైన వారికి 40 రోజుల పాటు అప్రెంటిస్‌షిప్ శిక్షణ ఉంటుంది. దీంతోపాటు రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవోను నియమించడంలో భాగంగా రెండో విడత కింద దరఖాస్తు చేసుకున్న వీఆర్‌పే, వీఆర్వోలకు ఈ నెల 27న అర్హత పరీక్ష నిర్వహిస్తాం. రాష్ట్రంలో నక్షాలు లేని 413 గ్రామాలను గుర్తించాం. తొలుత పైలట్ ప్రాజెక్టుగా ఐదు గ్రామాల్లో సర్వే పూర్తి చేశాం. సర్వే ఫలితాలను పరిగణనలోకి తీసుకుని మిగిలిన గ్రామాల్లో కూడా రీ సర్వే నిర్వహించడానికి చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.



## బీసీల రిజర్వేషన్ల పెంపు రాహుల్, రేవంత్‌ల నిబద్ధతకు నిదర్శనం

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- మద్దతివ్వాలని ప్రతిపక్షాలకు మంత్రుల వినతి

**హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిల నిబద్ధతకు నిదర్శనమని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. రిజర్వేషన్లపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం గాంధీభవన్‌లో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్‌ల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... "పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ బీసీలకు ఏం చేశారు? కవిత అప్పుడెందుకు ప్రశ్నించలేదు? ఇప్పుడు కాంగ్రెస్ చేసిన దానికి ఆమె రంగులు పూసుకోవడమేంటి?" అని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### బీసీల నోటి దాకా వచ్చిన ముద్దను లాక్కోకండి

"రెండు చేతులు జోడించి దండం పెడుతున్నాం. పంచాయతీరాజ్ ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు క్యాబినెట్ తీసుకున్న నిర్ణయానికి రాజకీయాలకు అతీతంగా సంపూర్ణ మద్దతివ్వండి. బీసీల నోటి దాకా వచ్చిన రిజర్వేషన్ల ముద్దను లాక్కోకండి" అని ప్రతిపక్షాలను ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, షబ్బీర్‌అలీ, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముదిరాజ్ విన్నవించారు. గాంధీభవన్‌లో వారు మాట్లాడుతూ... "బీసీలకు 42% రిజర్వేషన్లు సామాజిక న్యాయంలో ఒక భాగం. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ పాస్ చేసుకోవచ్చు. ఈ రిజర్వేషన్లు స్థానిక ఎన్నికల వరకే వర్తిస్తాయి" అని తెలిపారు. బీసీలకు 42% రిజర్వేషన్లపై మంత్రివర్గం తీర్మానించడం సువర్ణాక్షరాలతో లిఖించదగిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన దిల్లీలో మాట్లాడారు. ఇదే విషయమై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు.



## ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేంద్రం

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ
- నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నాగర్‌కర్నూల్ :** ప్రతి 35 కిలోమీటర్లకు ట్రామా కేంద్రం, ప్రతి జిల్లాకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కల్వకుర్తిలో వంద పడకల ఆసుపత్రికి, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ఆవరణలో రూ.230 కోట్లతో 550 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉయ్యాలవాడ వద్ద రూ.166 కోట్లతో నిర్మించిన వైద్య కళాశాల భవనాన్ని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో కలిసి ఆయన ప్రారంభించారు. మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీతో వైద్యవిద్యను అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని నాలుగు ప్రధాన నగరాల్లో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య కళాశాలకు తన ఛారిటీ ట్రస్ట్ నుంచి అవసరమైన ఏర్పాట్లను చేయిస్తానని హామీ ఇచ్చారు. వనపర్తి నుంచి జడ్చర్ల రోడ్డు, బిజినేపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వరకు రోడ్డు విస్తరణకు రూ.140 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఏకకాలంలో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు జమ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వైద్య విద్యార్థులు నాగర్‌కర్నూల్‌లోని వైద్య కళాశాల నుంచి పట్టణంలో ఉన్న ఆసుపత్రికి రాకపోకలు సాగించేందుకు రూ.50 లక్షలతో ఎలక్ట్రికల్ బస్సును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కల్వకుర్తిలో మెప్మా మహిళా సంఘాలకు మంత్రులు చెక్కును పంపిణీ చేశారు.



## భూతాపాన్ని తగ్గించేందుకు త్రిముఖ వ్యూహం

- 2047నాటికి పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలి
- పునరుత్పాదక ఇంధనంపై సమీక్షలో గవర్నర్ జిష్ణుదేవ్

**హైదరాబాద్, జూలై 11 :** పెరుగుతున్న భూతాపాన్ని తగ్గించేందుకు దేశ ప్రధాని పిలుపుమేరకు త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణలో పచ్చదనాన్ని 50శాతానికి పెంచాలనే లక్ష్యంతో మొక్కలు నాటే కార్యక్రమాలను ముమ్మరం చేయాలని, ఇంధన పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వానికి సూచించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషీయన్సీ(బీఈఈ) దక్షిణ భారత మీడియా సలహాదారు ఏ.చంద్రశేఖర్‌రెడ్డి, ఎనర్జీ ఎఫిషీయన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎసఎల్) అధికారులు శుక్రవారం గవర్నర్‌ను కలిసి ఇంధన సామర్థ్య రంగంలో కీలక పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ గ్రీన్‌హౌస వాయు ఉద్గారాలను తగ్గించడానికి ప్రభుత్వాలతోపాటు ప్రజలు దృష్టి సారించాలని కోరారు. వాతావరణ మార్పుల వల్లే కలిగే ప్రభావాలను తగ్గించేందుకు ఇంధ న సామర్థ్యమే ఎక్కువగా దోహదపడుతుందన్నారు. సౌర విద్యుత్ తయారీలో మహిళలకు భాగస్వామ్యం కల్పించిన తెలంగాణ ప్రభుత్వ చొరవను ఆయన అభినందించారు. ఇళ్లల్లో వినియోగించే 16 ఉపకరణాలు తక్కువ విద్యుత్‌ను వినియోగించుకునేవై ఉండాలని, వీటిలో ఏసీలు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్లు సహా ఇతర పరికరాలు ఉన్నాయని బీఈఈ దక్షిణ భారత మీడియా సలహాదారు చంద్ర శేఖర్ రెడ్డి తెలిపారు. దీనిపై స్పందించిన గవర్నర్ ఈఈఎసఎల్ ద్వారా రాజ్‌భవన్, జేఎన్‌టీయూలో ఆడిట్ నిర్వహించి.. ఇంధన సమర్థవంతమైన క్యాంపసలుగా మార్చడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఈమేరకు ఈఈఎసఎల్ సీనియర్ అధికారి ఆదేశ్ సక్సేనా పదిహేను రోజుల్లో రాజ్‌భవన్‌లో ఇంధన ఆడిట్ నిర్వహిస్తామని గవర్నర్‌కు హామీ ఇచ్చారు.

## సన్నబియ్యం పంపిణీ.. చాలా సంతృప్తినిచ్చిన పథకం

### 14న తిరుమలగిరిలో సీఎం చేతుల మీదుగా కొత్త రేషన్‌కార్డుల పంపిణీ: మంత్రి ఉత్తమ్



**సూర్యాపేట :** 'రాష్ట్రవ్యాప్తంగా లక్షల కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు ఇవ్వబోతున్నాం.. ఈ కార్డుల జారీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది' అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ఈ నెల 14న (సోమవారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే కార్డుల పంపిణీ సభ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ... నూతన కార్డుల జారీతో పాటు అదనంగా కుటుంబ సభ్యులను కార్డుల్లో చేర్చుతున్నామన్నారు. స్వతంత్ర భారతదేశంలో సన్న బియ్యం పంపిణీని మించిన సంక్షేమ పథకం మరోటి లేదని వ్యాఖ్యానించారు. "ఏటా రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తూ 3.10 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. 95 లక్షల కుటుంబాల ఆకలితీర్చడం, అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వడం నా రాజకీయ జీవితంలో చాలా సంతృప్తిని ఇస్తోంది" అని ఉత్తమ్ పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఉధృతంగా గోదావరి

- ఎగువన కురుస్తున్న వర్షాలతో పరవళ్లు
- సమ్మక్క సాగర్, మేడిగడ్డ బ్యారేజీలకు భారీగా వరద.. అన్ని గేట్లూ ఎత్తివేత
- కొనసాగుతున్న దేవాదుల పంపింగ్
- భద్రాద్రి వద్ద 37.2 అడుగుల నీటిమట్టం

**భద్రాద్రి : ఎగువ** ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరి, కృష్ణా నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. రెండు నదులపై ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుంచి భారీగా వరద వస్తుండడంతో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీకి 7,46,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నీటిమట్టం 82.10 మీటర్లు ఉండగా... బ్యారేజీ మొత్తం 59 గేట్లను ఎత్తివేశారు. ఇదే మండలం గుట్టల గంగారం వద్ద చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో 3 మోటార్ల ద్వారా 831 క్యూసెక్కుల నీటిని భూపాలపల్లి జిల్లా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద 83.3 మీటర్ల నీటిమట్టం నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీకి శుక్రవారం 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.60 మీటర్లు ఉంది. మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. శుక్రవారం సాయంత్రం 11.79 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ఇది 12.2 మీటర్లు దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ఏటూరునాగారం మండలం పుష్కరఘాట్ వద్ద గోదావరి పెరుగుతూ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు 14.4 మీటర్లకు చేరింది. 14.82 మీటర్లకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. వాజేడు మండలంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పూసూరు-ఎడ్జర్లపల్లి, పేరూరు-చంద్రుపట్ల, వాజేడు-గుమ్మడిదొడ్డి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 163వ జాతీయ రహదారిపైకి వరద నీరు ప్రవేశించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మంగపేట మండలంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్ వెల్ వద్ద నీటిమట్టం 8.5 అడుగులకు చేరింది. ఇక భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 30 అడుగులు ఉండగా.. శుక్రవారం ఉదయం 6 గంటలకు 33.3 అడుగులకు పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు 35.4 అడుగులు నమోదై సాయంత్రం 6 గంటలకు 37.2కు చేరింది.

# యూనివర్సిటీల్లో పెత్తనానికి కేంద్రం యత్నం

- రోహిత్ వేములను అడ్డుకున్న వారికి అందలం
- బెదిరింపులకు పాల్పడ్డ రామచంద్రరావుకు బిజెపి పదవి
- దళితులు, ఆదివాసీలను అణగదొక్కేవారికి పదవులు
- ఢిల్లీలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క



**న్యూఢిల్లీ, జూలై 11 :** హెచ్‌సీయూ పీహెచ్‌డీ స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్యకు కారణమైన రామచందర్ రావును తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఎలా నియమిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావుపై డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం నాడు దిల్లీలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను భాజపా ప్రభుత్వం హరిస్తోందన్నారు. ఆయనకు ఆ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం పునరాలోచన చేయాలన్నారు. రోహిత్ వేముల మరణానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకుండా పదవులు ఇస్తున్న బీజేపీ.. దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రోహిత్ వేముల ఆత్మహత్య ఘటనపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరుపుతోందన్నారు. త్వరలోనే తెలంగాణలో రోహిత్ వేముల చట్టాన్ని తీసుకువస్తామని.. న్యాయశాఖ దీనిపై పనిచేస్తోందని చెప్పారు. రోహిత్ ఆత్మహత్యకు కారణమైన బండారు దత్తాత్రేయకు గవర్నర్ పదవి, ఏబీవీపీ నాయకుడు సుశీల్ కుమార్‌కు ఢిల్లీ యూనివర్శిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్, రామచందర్ రావుకు తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఇచ్చారన్నారు. 2016లో యూనివర్శిటీ- యాజమాన్యం రోహిత్ వేములపై చర్యలు తీసుకునేలా యూనివర్శిటీ- వద్ద రామచందర్ రావు ఆందోళన చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం దళితులు భయపడేలా బీజేపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దళితులు, ఆదివాసీలకు దేశంలో గౌరవం లేకుండా బీజేపీ ప్రవర్తిస్తోందని విమర్శించారు. దేశంలో దళితులు, ఆదివాసీలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారికి బీజేపీ పదవులు ఇస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరమన్నారు ఉపముఖ్యమంత్రి. రాజ్యాంగానికి వ్యతిరేకంగా బీజేపీ వ్యవహరిస్తోందని ఫైర్ అయ్యారు. దేశంలో వందల ఏళ్లుగా వెనుకబడిన వర్గాలు అణచివేతకు గురవుతున్నాయని తెలిపారు. దేశంలో ఉన్న ప్రతీ పౌరుడి హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని డిప్యూటీ- సీఎం స్పష్టం చేశారు. అలాగే రోహిత్ వేముల చనిపోతే కనీసం ఆ కుటు-ంబాన్ని కేసీఆర్ పరామర్శించలేదని వ్యాఖ్యలు చేశారు. ఏ రోజు కూడా యూనివర్శిటీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వం యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. యూనివర్సిటీలపై పెత్తనాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఏబీవీపీ, ఏఎస్ఏ మధ్య ఘర్షణ జరిగినప్పుడు భాజపా నేత రామచందర్‌రావు హెచ్‌సీయూకి వెళ్లి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. రోహిత్ వేములతో పాటు మరో నలుగురు విద్యార్థులను యూనివర్సిటీ- నుంచి సస్పెండ్ చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అతను ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పట్లో ఈఘటన దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దళిత, ఆదివాసీలను భాజపా చిన్నచూపు చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం చర్యలను మేధావులు వ్యతిరేకించాలని భట్టి విక్రమార్క అన్నారు. 2017లో హైదరాబాద్ యూనివర్సిటీలో జరిగిన రోహిత్ వేముల ఆత్మహత్య దేశాన్ని కుదిపేసిందని గుర్తు చేస్తూ.. ఆ ఘటన వెనుక ఉన్న అసలు బాధ్యులను దేశ ప్రజలముందు నిలబడే చర్యనే అతి పెద్ద ప్రశ్నగా ఆయన అభివర్ణించారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 2017 లో రోహిత్ వేముల ఆత్మహత్య దేశాన్ని షేక్ చేసింది. సూసైడ్ లేఖలో రోహిత్ వేముల రాసిన అంశాలను పరిశీలిస్తే, ఎన్నో విషయాలు తెలుస్తాయి. ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటాలను అడ్డుకున్న ఏబీవీపీ సుషీల్ కుమార్కు డిల్లీ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఇచ్చారు. ఇది దేశంలో జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలు గమనించాలని భట్టి ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థులపై రామచందర్ రావు ఒత్తిడి తెచ్చారని.. వీసీపై ఒత్తిడి తెచ్చిన వ్యక్తిని బీజేపీ ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడమంటే, దళితులను ఇబ్బంది పెట్టిన వారికి బహుమతి ఇచ్చినట్లే అని వ్యాఖ్యానించారు. అలాగే రోహిత్ వేముల కేసు పునర్విచారణకు కోర్టును ఆశ్రయించామని, త్వరలోనే తెలంగాణలో 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని సంకల్పించినట్లు- అయన వ్యాఖ్యానించారు.

## కల్తీకల్లు బాధితుల్లో కిడ్నీ పేషెంట్లు

- కిడ్నీలు పనిచేయని వారు 9మంది
- హెల్త్ బులిటెన్ విడుదల చేసిన నిమ్స్

**హైదరాబాద్, జూలై 11 :** కల్తీకల్లు కారణంగా చికిత్స పొందుతున్న బాధితుల హెల్త్ బులిటెన్‌ను నిమ్స్ వైద్యులు విడుదల చేశారు. చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితులు సంఖ్య పెరుగుతోందని.. కిడ్నీ పనిచేయని వారి సంఖ్య 9 మందికి చేరిందని తెలిపారు. మరో ఇద్దరు బాధితులకు కూడా డయాలసిస్ చేయాల్సి పరిస్థితి ఉన్నట్లు వెల్లడించారు. చికిత్స పొందుతున్న వారిలో 11 మంది ఆరోగ్యంగా నిలకడగా ఉన్నట్లు- వైద్యులు వెల్లడించారు. ఇంకో 12 మందిని అబ్జర్వేషన్లో ఉంచి చికిత్స అందిస్తున్నామని బులిటెన్లో పేర్కొన్నారు. కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితుల సంఖ్య 44కి చేరింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు- తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ని(గురువారం) తెలిపారు. ప్రస్తుతం నిమ్స్‌లో 31 మంది, గాంధీ ఆస్పత్రిలో ఆరుగురు చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో మరో ఏడుగురికి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం కూకట్‌పల్లి పరిధిలోని పలు కల్లు కాంపౌండ్‌లలో కల్తీకల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.

## రాజాసింగ్ రాజీనామా ఆమోదించిన భాజపా



**హైదరాబాద్:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను భాజపా అధిష్ఠానం ఆమోదించింది. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు రాజాసింగ్ రాజీనామాను ఆమోదించామని, ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ప్రకటన విడుదల చేశారు. భాజపా రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక విషయంలో అలిగిన రాజాసింగ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ అందజేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు తనను అనుమతించలేదని, అందుకే రాజీనామా చేసినట్టు పేర్కొన్నారు.

### నా చివరి శ్వాస వరకు హిందుత్వం కోసమే పనిచేస్తా : రాజాసింగ్

**హైదరాబాద్:** హిందుత్వం కోసమే తన చివరి శ్వాస వరకు పనిచేస్తానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఇటీవల భాజపాకు ఆయన చేసిన రాజీనామాను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం ఆమోదించారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "హిందుత్వ భావజాలంతో దేశానికి, ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సరిగ్గా 11 ఏళ్ల క్రితం భాజపాలో చేరాను. పార్టీ నన్ను నమ్మి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు గోషామహల్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నా రాజీనామాను ఇవాళ భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆమోదించారు. తెలంగాణలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ రాత్రీపగలు పనిచేస్తున్న లక్షలాది భాజపా కార్యకర్తల బాధను నేను అధిష్ఠానానికి తెలియజేయలేకపోవచ్చు. ఏ పదవి, అధికారం, వ్యక్తిగత లబ్ధి కోసమో రాజీనామా చేయలేదు. నేను హిందుత్వం కోసమే పుట్టాను.. చివరి శ్వాస వరకు దానికోసమే పనిచేస్తాను" అని రాజాసింగ్ పేర్కొన్నారు.

## హెచ్‌సీఏ అవకతవకలపై లోతైన విచారణ

### నిందితుల కస్టడీకి సీఐడీ పిటిషన్

**హైదరాబాద్, జూలై 11 :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలపై సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన ఐదుగురు నిందితులు 14 రోజుల రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిందితులను మరింతగా విచారించాల్సిన అవసరం ఉందంటూ, తెలంగాణ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) మల్కాజ్‌గిరి కోర్టులో కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేసింది. సీఐడీ తమ పిటిషన్‌లో నిందితులను 10 రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని కోరింది. ఈ కస్టడీ పిటిషన్‌పై నేడు మల్కాజ్‌గిరి కోర్టు విచారణ జరిపనుంది. విచారణ అనంతరం కోర్టు తుది తీర్పు వెల్లడించనుంది. హెచ్‌సీఏ వ్యవహారాలపై విచారణ చేస్తున్న సీఐడీ, అసోసియేషన్ పేరుతో భారీగా అక్రమాలు చోటు-చేసుకున్నట్టు- గుర్తించింది. హెచ్‌సీఏకి వచ్చిన నిధుల దుర్వినియోగం, క్లబ్బులకు జరిగిన నిధుల కేటాయింపు, ఖర్చుల తీరును తేల్చే క్రమంలో అనేక అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఈ అవకతవకలకు కీలక సూత్రధారిగా వ్యవహరించినట్టు- అధికారులు భావిస్తున్నారు. బీసీసీఐ, ఐపీఎల్ ఫ్రాంచైజీల నుంచి గత రెండు సంవత్సరాలలో హెచ్‌సీఏకి దాదాపు రూ. 300 కోట్లు- వచ్చినట్టు సమాచారం. ఈ మొత్తంలో ఎన్నికలు, క్లబ్‌లకు నిధుల మంజూరు, ప్రాజెక్టుల కేటాయింపులపై అనేక ప్రశ్నలు నిలుస్తున్నాయి. ఈ అంశాలపై స్పష్టత కోసం సీఐడీ నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలని కోరుతోంది. ఈ కేసు నేపథ్యంలో హెచ్‌సీఏలో ఉన్న లోపాలను సమూలంగా పరిష్కరిం చాలని, ఆటతో నడిచే వ్యవస్థలు పారదర్శకంగా ఉండాలని క్రికెట్ అభిమానులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఐ ఈఆలో అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఐఈఆ కేసు వివరాలు ఇవ్వాలని సీఐడీకి ఈడీ లేఖ రాసింది. రిమాండ్ రిపోర్టులు, వాంగ్మూలాలు ఇవ్వాలని లేఖలో సీఐడీని ఈడీ కోరింది. సీఐడీ నుంచి వివరాలు రాగానే కేసు ఈడీ నమోదు చేయనుంది.



## బిసి రిజర్వేషన్లతో నీకేం సంబంధం

- నీవెందుకు రంగులు పూసుకుంటున్నావు
- కవిత ప్రకటనలపై పిసిసి చీఫ్ ఎద్దేవా

**హైదరాబాద్,జులై 11 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని టీ-పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఈ నిర్ణయం వెనక ఖర్గే, రాహుల్‌గాంధీ ఆశయం ఉందని చెప్పారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి నిరూపితమైందని చెప్పారు. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ ఎనలేని కృషి చేస్తోందని వివరించారు. అయితే బీసీ రిజర్వేషన్లకు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవితకు ఏం సంబంధం అని ప్రశ్నించారు. మేం చేసిన దానికి ఆమె క్రెడిట్ తీసుకోవడమేంటని, కవితను చూసి జనాలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఆమె ఉద్యమిస్తే మేం ఆర్డినెన్స్ తెచ్చామా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పదేళ్లు ఏం వెలగబెట్టారని ఆమె బీసీ పాట పాడుతున్నారు. బీసీ రిజర్వేషన్లు రాహుల్ అజెండా, రేవంత్ నిబద్ధత అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కవితకు రాజకీయంగా ఎక్కడా చోటు లేకపోవడంతో డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీసీలకు కాంగ్రెస్ మేలు చేస్తే కవిత ఎందుకు రంగులు పులుముకుంటుందని ప్రశ్నించారు. కవితకు, భవితకు సంబంధం లేదని అన్నారు. రాహుల్ గాంధీ ఆదేశం మేరకు రేవంత్ రెడ్డి బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలను వంచించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లు తగ్గించిన ఘనత కేసీఆర్ దని అన్నార. కేసీఆర్ కూతురైన కవిత పండుగ చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీసీ నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని చెప్పారు. బీసీల విషయంలో చిత్తశుద్ధితో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు.



## ప్రశాంతవాతావరణంలో బోనాలు

### ఉజ్జయిని బోనాలపై తలసాని సమీక్ష
### 13న సిఎం రేంవత్ రెడ్డి ప్రత్యేక పూజలు

**హైదరాబాద్, జులై 11 :** ఆదివారం జరిగే ఉజ్జయిని మహంకాళి బోనాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. భక్తులు కూడా సహకరించి బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. శుక్రవారం మహంకాళి ఆలయ పరిసరాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని మీడియాతో మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు మన అందరి పండుగ. గొప్పగా చేసుకుందాం. బోనాల సందర్భంగా ఎంతో చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి దర్శనం, బోనాలు సమర్పించేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటు-న్నాం. 13న తెల్లవారుమున 3 గంటల నుంచే బోనాలు సమర్పించేందుకు వీలుగా అన్ని ఏర్పాట్లు- చేశాం. భక్తులు క్యూ లైన్‌లలో ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నాం. శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు- చేయడమే కాకుండా, వివిధ ప్రాంతాల నుంచి అదనపు పోలీసు బలగాలను రప్పిస్తున్నాం. భక్తులకు తాగునీరు అందించేందుకు జీహెచ్ఎంసీ వాటర్ వర్క్స్ అధికారులు ఏర్పాట్లు- చేస్తున్నారని చెప్పారు. ఉజ్జయిని మహాకాళి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆమె పాల్గొన్నారు. బోనాల ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన తలసాని.. మాజీ ఎమ్మెల్యే ప్రసూనతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పటి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కాసేపు సరదాగా మాట్లాడారు. సికింద్రాబాద్ మహంకాళి బోనాల జాతరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు పోలీసులు. జులై 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ మహంకాళి ఆలయ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులందరూ పోలీసులకు సహకరించాలని కోరారు ట్రాఫిక్ పోలీసులు. ట్రాఫిక్ పోలీసులు సూచించిన మార్గంలోనే వాహనదారులు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు పోలీసులు. జులై 13న సీఎం రేవంత్ రెడ్డి మహంకాళి అమ్మవారికి బోనం సమర్పిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం పక్షాన జిల్లా కలెక్టర్,దేవాదాయ శాఖ,పోలీస్ , జీహెచ్ ఎంసీ అధికారులు అన్ని ఏర్పాట్లు- పూర్తి చేశారు. ప్రభుత్వం ఎన్ని ఏర్పాట్లు- చేసిన ప్రజల సహకారం అవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎటువంటి అసౌకర్యం కలగకుండా భక్తులకు ఏర్పాట్లు- చేశామన్నారు. లష్కర్ బోనాలు చారిత్రాత్మక మైనవని చెప్పారు. ప్రజల మంచికొరకు అమ్మవారి ఆశీర్వాదం ఉండాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బోనాల పండగ సందడి కొనసాగుతోంది..రాష్ట్ర వ్యాప్తంగా బోనాల పండుగ వైభవంగా జరుపుకుంటారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో బోనాల పండగ తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా జరుపుకుంటారు. నెలరోజుల పాటు- జరిగే ఈ ఉత్సవాలతో నగరంలో అధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంటు-ంది. గోల్కొండ, లాల్ దర్వాజ, ఉజ్జయిని అమ్మవారి బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలో ఆదివారం జులై 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలతో పాటు- వైన్స్ లు కూడా క్లోజ్ చేయాలని ఆదేశించారు.

## హామీని నిలబెట్టుకున్న నేత రేవంత్ రెడ్డి

- 42శాతం బిసి రిజర్వేషన్లతో సామాజనిక న్యాయం
- దేశంలో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది
- రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ప్రశంసలు



**ఖమ్మం, జులై 11 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి తన మాటను నిలబెట్టుకున్న నాయకుడిగా నిలిచాడని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి అన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. ఇది రాజకీయ నిర్ణయం కాదని, సామాజికంగా గొప్ప మార్పునకు నాంది అని అభివర్ణించారు. అలాగే, ఇవ్వాళ నాకు చాలా గర్వంగా ఉంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రజలందరికీ గర్వపడే రోజులు ఇవని రేణుక పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సామాజిక న్యాయం సాధ్యమవు తోందని తెలిపారు. ఎవరెవరో మాటలు చెప్పారు కానీ.. చేసి చూపించింది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఆమె స్పష్టం చేశారు. గురువారం జరిగిన కేబినెట్ తీసుకున్న 42శాతం బీసీ రిజర్వేషన్ నిర్ణయం వల్ల వారికి రాజకీయాల్లోనే కాదు.. ఉద్యోగాల్లోనూ మెరుగైన అవకాశాలు లభించను న్నాయని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఒక్క సంతకంతో మహిళల జీవితాలను మార్చారు. ఆయన తీసుకున్న నిర్ణయాలతో భర్తలు కూడా గౌరవం చూపిం చారు. ఇప్పుడు రాహుల్ గాంధీ హయంలో బీసీలకు చరిత్ర సృష్టించే నిర్ణయం తీసుకున్నారు. 42 శాతం రిజర్వేషన్ దేశానికే మార్గదర్శిగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ నిర్ణయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. నాకు దేశవ్యాప్తంగా మెసేజ్‌లు వస్తున్నాయి. ప్రజలు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. న్యాయం చేయగలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని రేణుకా చౌదరి అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీపై ఆమె విమర్శలు గుప్పించారు. వాళ్లు పూటకోసారి పార్టీ పేరు మారుస్తుంటారు. కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలి.. ఎందుకంటే వాళ్లు అలాగే ఉన్నప్పుడు మేము అధికారంలో ఉంటాం. బీఆర్ఎస్‌లో గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్సీ కవిత గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని వ్యాఖ్యానించారు. ఇన్ని సంవత్సరాలు నాయకులు చెప్పినవి సొల్లు కబుర్లే.. కానీ ఇప్పుడు రాష్ట్రానికి అసలైన సీఎం లభించడమే గొప్ప విషయం. రేవంత్ రెడ్డి చేసిన నిర్ణయం దేశానికి మార్గం చూపుతుంది. చేతి గుర్తు అన్నది దేశాన్ని ముందుకు నడిపే సత్తా ఉన్న చిహ్నం అని అన్నారు.

## వైద్య కళాశాల విద్యార్థినులకు వేధింపులు

- బాధ్యులైన ఉద్యోగుల సస్పెన్షన్..
- క్రిమినల్ కేసులు నమోదు : కలెక్టర్ వెల్లడి

**కాకినాడ, జులై 11 :** రంగరాయ వైద్య కళాశాలలో వైద్య కళాశాల విద్యార్థినులకు వేధింపుల కేసులో తోణ చర్యలకు దిగారు. బాధ్యులైన ఉద్యోగుల సస్పెన్షన్..వేటుపడింది. వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు. రంగరాయ విద్యార్థినులకు లైంగిక వేధింపుల ఘటనలో బాధ్యులను సస్పెండ్ చేశామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈనెల 9న కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌కు ఓ విద్యార్థిని నుంచి మెయిల్ వచ్చింది. నలుగురు వేధిస్తున్నారని 50 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో ఉన్న కల్యాణ్ చక్రవర్తిపై ఎక్కువ ఫిర్యాదులు అందాయి. వాట్సప్‌లో అసభ్య మెసేజ్‌లు, వ్యాఖ్యలు చేస్తున్నట్లు గుర్తించాం. కొంతమంది విద్యార్థులతో మాట్లాడి నప్పుడు కల్యాణ్ చక్రవర్తితో పాటు- జమ్మిరాజు, గోపాలకృష్ణ, ప్రసాద్ పేర్లు కూడా వచ్చాయి. వారిపైనా చర్యలు తీసుకున్నాం. వారిని సస్పెండ్ చేసిన అనంతరం విచారణ చేపట్టాం. కళాశాలలో గతంలో ఇలాంటివి జరిగాయా? అనే కోణంలో విచారించాం. వేధింపులపై మెయిల్ పంపిన విద్యార్థినిని అభినందిస్తున్నాంఅని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై శుక్రవారం ఉదయం నుంచి మూడు ఫిర్యాదులు అందాయని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. వన్‌టౌన్ పీఎస్‌లో 2, టూటౌన్‌లో ఒక ఫిర్యాదు వచ్చిందన్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టినట్లు- తెలిపారు.

## బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ ప్రకటన

### రైల్‌రోకో వాయిదా వేస్తున్నట్లు కవిత వెల్లడి



**హైదరాబాద్, జులై 11 :** బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. ఆర్డినెన్స్ తీసుకు నిరావడాన్ని తెలంగాణ బీసీ బిడ్డలు, జాగృతి విజయంగా భావిస్తున్నామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తేవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. బీసీ బిల్లును షెడ్యూల్-9లో పెట్టాలి. దీనికోసం బీసీ బిడ్డ, కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలి. ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పినందున ఈ వారం రోజులు ప్రభుత్వ కార్యాచరణను గమనిస్తాం. దీనిపై ముందుకెళ్లకపోతే రైల్ రోకో చేపడతాం అని కవిత అన్నారు. అంతకుముందు బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి జాగృతి శ్రేణులతో ర్యాలీగా లోయర్ ట్యాంక్‌బండ్‌కు వెళ్లారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె నివాళుల ర్పించారు. స్థానిక ఎన్నికలకు ముందే 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో ఈనెల 17న చేపట్టిన రైల్ రోకో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నా మని అన్నారు. అయితే మాకు కొన్ని అనుమానాలు కూడా ఉన్నాయి. ఆర్డినెన్స్ ఇచ్చి వెంటనే రిజర్వేషన్లు అమలు చేయగలిగితే అధికారంలోకి వచ్చిన 18 నెలలు ఎందుకు ఆగారని అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే అలా చేశారని మేం భావిస్తున్నాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఇబ్బంది పడుతున్నారు. రాజ్యాంగ సవరణ జరిగితే బీసీలకు రాజకీయంగా హక్కులు లభిస్తాయి. విద్య, ఉద్యోగాల గురించి కూడా ప్రభుత్వం చెప్పాలి. కేంద్రంలో అధికారంలో ఉన్నందున భాజపా అనుకుంటే ఒకే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి ఇవ్వగలదు.. కానీ ఇవ్వడం లేదు. దోషమంతా కాంగ్రెస్‌పై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారేమోనని, అయితే ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

## సంపాదకీయం

# మానవ వనరుల వినియోగంలో వైఫల్యం!



జనాభా పెరుగుదల అన్నది అభివృద్ధికి సూచిక కానేకాదు. జనాభా వల్ల వనరులు తగ్గుతాయి. ఆర్థిక భారం పడుతుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో జనాభా వల్ల ఖజానాపై అత్యధిక భారం పడుతుంది. ఎందుకంటే వీరందరికి పెన్షన్లు ఇవ్వాలి.కిలోరూపాయి బియ్యం పథకం అమలు చేయాలి. ఇంట్లో ఎందరు ఉంటే అంతమందికి బియ్యం ఇవ్వాలి. ఎందరుంటే అంతమందికి పెన్షన్లు ఇవ్వాలి. వీరుమాత్రం దర్జాగా ప్రభుత్వ పథకాలతో కాలక్షేపం చేస్తూ బలాదూర్‌గా తిరుగుతున్నారు. ఇప్పటికే ఏ రంగంలోనయినా కూలీల కొరత తీవ్రంగా ఉంది. జనాభా ఉన్నాకూలీలు దొరకని దేశం ఒక్క భారత్ మాత్రమే అయివుంటుంది. జనాభాను ఉపయోగించి వస్తూత్పత్తి చేసి, ఎగుమతులు చేయడం ద్వారా పటిష్ట ఆర్థిక విధానాలు అమలు చేసే ప్రణాళికలు భారత దేశంలోని ప్రభుత్వాల వద్ద లేవు. చైనాలాంటి దేశాలు అధిక జనాభాను కూడా ఆర్థిక ఉత్పత్తికి కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నాయి. ప్రజలందరికి పని కల్పించి, వారితో వస్తూత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు. దాంతో విదేశాలకు ఎగుమతులు పెంచి ఆర్థికంగా బలపడుతున్నారు. కానీ భారత్‌లో అది సాధ్యం కావడం లేదు. ఇప్పటికే వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. పనులు చేసేందుకు ఎవ్వరూ ముందుకురావడంలేదు. పనిచేయకున్నా పస్తులుండే పరిస్థితులు లేవు. ఎందుకంటే ప్రభుత్వం ఏదోరకంగా ఏదో ఒక పథకంతో ఆదుకుంటోంది. లేదా రాజకీయ పార్టీల జెండాలు మోస్తే వారే మందు, బిర్యానీలు సరఫరా చేస్తుంటారు. ఇలా మానవవనరులను వృథా చేసుకుంటున్న ఏకైక దేశం భారత్ మాత్రమేనని చెప్పడంలో వెనకాడాల్సిన పనిలేదు. దీనికంతటికీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అందువల్ల వారు పనిచయడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వ పథకాలు ఏవేవి వస్తున్నాయో లెక్కలు కట్టి మరీ రాబట్టు కుంటున్నారు. దీంతో వారు కాయకష్టం చేయడానికి ఇష్టపడడం లేదు. భారతదేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా ప్రతిరంగంలోనూ కార్మికుల కొరత ఉంది. అందరూ వైట్ కాలర్జాబ్‌లే చేయాలనుకుంటున్నారు.

స్వయం ఉపాధి రంగాలపై శ్రద్ధ చూపడం లేదు. ఆయా రంగాలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండడం లేదు. ఉదాహరణకు కోళ్ల పెంపకానికి డిమాండ్ ఉంది. అలాగే పాడిపరిశ్రమకునిత్యం డిమాండ్ ఉంది. గొర్రెలు, చేపల పెంపకానికి కూడా డిమాండం ఉంది. ఈ రంగాల్లో స్వయం సమృద్ధితో ఉపాధి పొందవచ్చు. కానీ యువత అందుకు సిద్దంగా లేదు. ఈ క్రమంలో జనాభా పెరగాలని రష్యా లాంటి దేశాలు ఆరాటపడు తున్నాయి. భారత్ లాంటి దేశాలు వద్దు బాబోయం అంటున్నాయి. కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో సతమతమవుతూ..జనాభా నియంత్రణ చర్యలు పాటిస్తున్నాయి. మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తున్నాయి. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల పరిస్థితులు కూడా ఇలాగే ఉన్నాయి. జనాభా పెరగాలని ఎపి సిఎం చంద్రబాబు లాంటి వారు కోరుకుంటున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యమిస్తుండగా, దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు కారణమని తెలుస్తున్నది. జనాభా పెరగాలంటున్న చంద్రబాబు లాంటి వారివద్ద సరైన ప్రణాళికలు లేవు. ఉన్న జనాభాను ఎలా వినియోగిం చుకోవాలో తెలియదు. ఇప్పటికే ఖజానా భారంగా మారినా ఊరూరా పెన్షన్ల పంపిణీని జాతరలా కొనసాగి స్తున్నారు.

ఇదంతా కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేస్తున్నదే తప్ప మరోటి కాదు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే దేశంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు. వస్తూత్పత్తని పెంచవచ్చు. వ్యవసాయక దేశమైన భారత్‌లో తిండిగింజలను పండించవచ్చు. వనరులను ఉపయోగించుకుని వ్యవసాయంలో ఆర్థిక విప్లవం తీసుకుని రావచ్చు. కానీ ఇలా ఆలోచన చేసే నేతలు దేశంలో లేరు.140 కోట్ల జనాభాతో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణంపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది. వనరులను దెబ్బతీస్తుంది. పర్యావరణ విధ్వంసానికి కారణం అవుతుంది. అయితే సమర్థవంత మైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు. జనాభాను ఉపయోగించుకోవడం అన్నది నేతల సమర్థతకు పరీక్ష లాంటిది. అధిక జనాభా ఉన్నా కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో అభివృద్ధిపథంలో దూసుకు పోతున్నాయి. అందుకు చైనా మన కళ్లముందు కనిపిస్తున్న ఉదాహరణ. అధిక జనసాంద్రత ఉన్నప్పటికీ సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలో జనసాంద్రత పరంగా సింగపూర్ మూడో స్థానంలో ఉంది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా ఉంది. జనసాంద్రత పరంగా చైనా ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని అమలు చేసి, దాదాపు 40 కోట్ల జనాభాను నియంత్రించింది. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతం గా ఉపయోగించింది. ఫలితంగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో 35 ఏళ్లలోపు యువ జనాభా 65 శాతం ఉంది. ఈ జనాభాను పనివిధానంలోకి మారిస్తే అద్భుతాలు సాధించవచ్చు. ఇది సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడు తుంది. ఎగుమతి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. అయితే ఇప్పటి వరకు ఏ రాష్ట్రం లేదా కేంద్రం ఇలాంటి ఆలోచనలు చేయలేదు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధానం కనుక అటువైపే ప్రణాళికలు ఉంటున్నాయి. ఈ దుస్థితి పోవాలంటే జనాభాను తగ్గించుకోక తప్పదు.

# టిటిడిలో అన్యమత ఉద్యోగులను తొలగించాలి

## కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్



**తిరుమల, జూలై 11 :** టీటీడీలో 1000 మందికి పైగా అన్యమత స్థులు పని చేస్తున్నారని వారిని వెంటనే తొలగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీనివాసుడిని కేంద్రమంత్రి బండి సంజయ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రికి ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. దర్శనానం తరం కేంద్రమంత్రి బండి సంజయ్ ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో పని చేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని అన్నారు. వారికి హిందూ సనాతన ధర్మంపై విశ్వాసం లేదన్నారు. టీటీడీ పాలకమండలి వెంటనే స్పందించి వారందరినీ తొలగించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ ఉద్యోగిని తొలగించడంపై స్పందించిన కేంద్ర మంత్రి.. ఒకరిని తొలగిస్తే సరిపోదని, ఇక్కడ పనిచేస్తున్న అన్యమత ఉద్యోగస్థులందరినీ గుర్తించి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అన్యమస్థులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలతోపాటు- పురాతన ఆలయాలను టీటీడీ అభివృద్ధి చేయాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లెందు రామాలయం, కొండగట్టు ఆంజనేయ స్వామి, వేములవాడ ఆలయాల అభివృద్ధికి టీటీడీ సహకారం అందించాలని కేంద్రమంత్రి కోరారు. శ్రీవారి సేవలో నిజమైన భక్తి, నిబద్ధతతో పనిచేసే వారికే అవకాశం కల్పించాలంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## మరోమారు కాళేశ్వరం

# కమిషన్ ముందుకు హరీష్ రావు

- కెబినెట్ నిర్ణయాలు.. అసెంబ్లీ ఆమోదించిన వివరాలు అందచేత
- కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తప్పులతడక
- విమర్శలు గుప్పించిన మాజీమంత్రి



**హైదరాబాద్, జూలై 11 :** కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ముందు విచారణకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం హాజరయ్యారు. బీఆర్‌కే భవన్‌లో మరోసారి పీసీ ఘోష్ కమిషన్‌ను హరీష్‌రావు కలిశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మరింత అదనపు సమాచారాన్ని ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఆరుసార్లు కేబినెట్ ఆమోదం పొందిందని గుర్తుచేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. అసెంబ్లీలో కూడా మూడుసార్లు ఆమోదించారని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. ఈ వివరాలన్నీ డాక్యుమెంట్లతో సహా కమిషన్‌కు ఇచ్చానని చెప్పుకొచ్చారు. మిగిలిన వివరాలు రేవంత్ ప్రభుత్వం దగ్గరే ఉన్నాయని వివరించారు. కమిషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినవన్నీ అసత్యాలేనని ఆరోపించారు. 50 ఏళ్లుగా కాంగ్రెస్‌వి అబద్ధాలు, మోసాలేనని విమర్శించారు. కృష్ణా జలాల్లో 299 టీ-ఎంసీల కేటాయింపు కాంగ్రెస్ పాపమేనని మండిపడ్డారు. సెక్షన్ 3 కింద నీళ్ల పంపిణీ చేయాలని అప్పుడే అడిగారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రజా భవన్‌లో కాళేశ్వరంపై ఇచ్చింది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కాదు...కవర్ పాయింట్ ప్రజెంటేషన్ అని మాజీ మంత్రి హరీష్‌రావు ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానం, అహంకారం బయటపెట్టుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 50 ఏళ్లు చేసిన ద్రోహాన్ని కప్పిపుచ్చుకోవడానికి కవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని దెప్పిపొడిచారు. 299 టీ-ఎంసీల పేరుతో శాశత్వ ఒప్పందమని సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఆనాడే 299 టీ-ఎంసీలకి ఉమ్మడి రాష్ట్రంలో ఒప్పందం చేశారని గుర్తుచేశారు. శాశ్వత ఒప్పందం కేసీఆర్ చేసి ఉంటే...సెక్షన్ 3 కోసం పోరాటం ఎందుకు చేస్తారని నిలదీశారు. సెక్షన్-3 విషయంలో ఉమా భారతి, గడ్కరీనీ కలిశారని చెప్పుకొచ్చారు మాజీ మంత్రి హరీష్‌రావు. కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి సెక్షన్-3ని కేసీఆర్ సాధించారని మాజీ మంత్రి హరీష్‌రావు ఉద్ఘాటించారు. బోర్డు తాత్కాలిక నీటి వినియోగం కోసం ఒప్పందం చేస్తుందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సైతం 299 టీఎంసీలకు సంతకాలు చేశారని మరి మీరు ఎలా చేశారని ప్రశ్నించారు. కృష్ణా నదిలో తెలంగాణ వాటాను రేవంత్ ప్రభుత్వం సాధించాలని కోరారు. రేవంత్ రెడ్డి అజ్ఞానంతో మాట్లాడారని.. తాను చాలా బాధతో చెబుతున్నానని అన్నారు. కృష్ణానదిని దోచుకో అని రేవంత్ రెడ్డి చంద్రబాబుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానాన్ని తాను బయటపెట్టిన తర్వాత ఆయన మాట మార్చారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎలాగూ తెలియదు... ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా తెలీదు అంటే బాధేస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు చెప్పినట్లు- కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. 573 టీ-ఎంసీలు చాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పడం అజ్ఞానమని విమర్శించారు మాజీ మంత్రి హరీష్‌రావు. 00 ఏళ్ల కింద కాకతీయులు, నిజాం కాలంలో కట్టిన ప్రాజెక్ట్‌లని రేవంత్‌రెడ్డి ఖాతాలో వేసుకున్నారు. దేశానికి స్వాతంత్రం రాకముందు కట్టిన ప్రాజెక్ట్‌లను కూడా ఆయన ఖాతాలో వేసుకున్నారు. కాంగ్రెస్ 6లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తే...బీఆర్ఎస్ పాలనలో 48 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చాం. తుమ్మిడిహెట్టి నుంచి బ్యారేజ్ మార్పుపై సీఎం రేవంత్‌రెడ్డి కేందప్రభుత్వాన్ని తప్పుబడుతున్నారు. కేంద్రం ఎందుకు అనుమతి ఇచ్చిందో ప్రశ్నించండి. 160 టీ-ఎంసీలకు కేంద్రం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అనుమతి తేలేదు?. అసెంబ్లీలో చర్చకు మేము సిద్ధం. మా మైక్ కట్ చేయకుండా, అసెంబ్లీ నుంచి పారిపోవద్దు. రేవంత్ 20 నెలల పాలనలో ఇప్పుడు ఒక్క చెరువు, చెక్ డ్యామ్ అయినా కట్టించారా.?. కేసీఆర్ ప్రభుత్వం ఏం చేయనిది నీళ్లు ఎలా వచ్చాయి.. పంటలు ఎలా పండాయి. కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను వాడటం లేదు... 6శాతం నీళ్లను తక్కువగా వాడారని హరీష్‌రావు విమర్శించారు.

# మయన్మార్‌లోని బౌద్ధారామంపై వైమానిక దాడి

## 23 మంది మృతి



**లౌకియాంగ్:** మయన్మార్‌లోని సగయింగ్ ప్రాంతంలోని ఓ బౌద్ధారామంపై జరిగిన వైమానిక దాడిలో 23 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 30 మందికిపైగా గాయాలపాలైనట్లు అక్కడి మీడియా వెల్లడించింది. క్షతగాత్రుల్లో పది మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అక్కడి ఆన్‌లైన్ మీడియా తెలిపింది. బౌద్ధారామానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి దాదాపు 150 మంది అక్కడ ఆశ్రయం పొందుతున్నారని తిరుగుబాటుదారుల నాయకుడొకరు చెప్పారు. అయితే, ఈ దాడులపై అక్కడి మిలిటరీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఫిబ్రవరి 2021లో ఆంగ్ సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలగొట్టి.. సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి మయన్మార్ అల్లకల్లోలంగా ఉంది. క్రమంగా అది అంతర్యుద్ధానికి దారితీసింది. శాంతియుత నిరసనలను సైన్యం అణిచివేయడంతో.. తిరుగుబాటు దారులు ఆయుధాలు చేపట్టారు. దీంతో సైన్యం, తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలతో మయన్మార్ అట్టుడుకు తోంది. ఈ క్రమంలోనే బౌద్ధారామంలో తిరుగుబాటుదారులు తలదాచుకుంటున్నట్లు సమాచారం అందుకున్న సైన్యం వైమానిక దాడి చేసినట్లు తెలుస్తోంది.

# రష్యా నుంచి చమురు దిగుమతులు

## ఓ రకంగా ప్రపంచ ఆర్థికానికి మేలు జరిగింది

### కేంద్ర పెట్రోలియ శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి

**న్యూఢిల్లీ, జూలై 11 :** రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ ప్రపంచానికి మేలు చేసిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఓ రకంగా భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసిందని అన్నారు. లేదంటే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆకాశన్నంటేవని తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై భారత్ ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తూనే ఉంది. తాజాగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి దీనిపై మరోసారి స్పందించారు. రష్యా చమురును ఎన్నడూ ఆంక్షల పరిధిలోకి తీసుకురాలేదు. కేవలం దాని ధరపై మాత్రమే పరిమితి విధించారు. ప్రపంచ చమురు సరఫరా గొలుసు ఎలా ఉంటుందన్న వాస్తవం చాలామందికి తెలుసు. రష్యా నుంచి డిస్కౌంట్లో వచ్చిన చమురును భారత్ కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ మార్కెట్లకు మేలే జరిగింది. లేదంటే చమురు ధరల మోత మోగేదని పురి అన్నారు. సాధారణంగా రష్యా రోజుకు 9 మిలియన్ బ్యారెల్ల చమురును ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తిదారుల్లో మాస్కో ఒకటి. ఇక, ప్రపంచవ్యాప్తంగా రోజుకు 97 మిలియన్ బ్యారెల్ల చమురు సరఫరా అవుతోంది. ఆంక్షల కారణంగా ఇందులో 9 మిలియన్ బ్యారెల్ల సరఫరా ఒక్కసారిగా ఆగిపోతే.. ప్రపంచ వినియోగంలో 10శాతం తగ్గించు కోవాల్సి వస్తుంది. అది అసాధ్యం. అప్పుడు సరఫరా తగ్గడంతో బ్యారెల్ చమురు ధర 120-130 డాలర్లకు పెరిగేదని కేంద్రమంత్రి వివరించారు. ఎనర్జీ మార్కెట్‌ను అర్థం చేసుకోలేనివారే ఇలాంటి అంశాలపై మాట్లాడతారని ఆయన దుయ్యబట్టారు.

# బలూచీలో 9మంది ప్రయాణికుల కాల్చివేత

**లాహోర్, జూలై 11 :** బస్సులో ప్రయాణిస్తున్న వారిలో తొమ్మిది మందిని కిందకు దించి దారుణంగా కాల్చి చంపారు. ఈ సంఘటన పాకిస్తాన్‌లోని అల్లకల్లోల బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. ప్రావిన్స్‌లోని జోబ్ ప్రాంతంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ప్రయాణీకుల బస్సు నుండి పంజాబ్‌కు చెందిన తొమ్మిది మంది ప్రయాణికులను దింపి.. తిరుగుబాటు-దారులు కాల్చి చంపారని అసిస్టెంట్ కమిషనర్ జోబ్ నవీద్ ఆలం తెలిపారు. క్వెట్టా నుండి లాహోర్‌కు వెళ్తున్న బస్సును ఆపి ప్రయాణికుల ఐడి కార్డులను తనిఖీ చేసి.. వారిలో తొమ్మిది మందిని కిందకు దింపి కాల్చి చంపారు. మృతులు పంజాబ్ ప్రావిన్స్‌లోని వివిధ ప్రాంతాలకు చెందినవారిగా గుర్తింపు. తొమ్మిది మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారని ఆయన అన్నారు.



# రుణ చెల్లింపుపై వివాదం..

## భార్య ముక్కు కొరికిన భర్త

**బెంగళూరు :** రుణ చెల్లింపు అంశంపై భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదం దారుణానికి దారి తీసింది. కోపంలో భార్య ముక్కును భర్త కొరికేశాడు. కర్ణాటకలోని దేవణగిరిలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. దేవణగిరికి చెందిన విద్య, ఆమె భర్త విజయ్ పూచీకత్తుపై రుణం తీసున్నారు. తిరిగి చెల్లించక పోవడంతో అప్పు ఇచ్చిన వారు వారిద్దరిపైనా ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో దంపతుల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన విజయ్.. తన భార్య ముక్కు కొరికేశాడు. తీవ్ర రక్తస్రావంతో ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకున్నారు. బాధితురాలిని చన్నగిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. విద్య ఫిర్యాదు మేరకు భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు.



## జన్మతః పౌరసత్వ హక్కుపై

# ట్రంప్ ఆదేశాల నిలిపివేత

**కాంకర్డ్ :** అమెరికాలో అక్రమంగా ఉంటున్న విదేశీయులకు పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన కార్యనిర్వాహక ఉత్తర్వులను న్యూహాంప్‌షైర్ ఫెడరల్ జడ్జి జోసెఫ్ లా ప్లాంటీ నిలిపేశారు. అమెరికా అంతటికీ ఈ తీర్పు వర్తిస్తుందని గురువారం ఆదేశాలిచ్చారు. దీనిపై అప్పీలుకు వీలుగా ఏడు రోజులపాటు స్టే ఇచ్చారు. ఫెడరల్ జడ్జి నిర్ణయంతో సుప్రీం కోర్టులో ఈ కేసు విచారణ త్వరితగతిన జరగనుంది. ఫెడరల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు దేశమంతటా వర్తిస్తాయా.. లేదా అనే విషయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నిర్ణయించనున్నారు.

## 1300 మంది దౌత్యవేత్తలు,

# సివిల్ సర్వెంట్ల తొలగింపు

**యూఎస్ :** అమెరికాలో ఉద్యోగాల కుదింపు ప్రక్రియ మళ్లీ మొదలైంది. తాజాగా విదేశాంగ శాఖలో చర్యలు చేపట్టిన ట్రంప్ యంత్రాంగం.. 1300 మంది ఉన్నతాధికారులను తొలగించేందుకు సిద్ధమైంది. ఈ జాబితాలో 1107 మంది సివిల్ సర్వెంట్లు, స్థానికంగా పనిచేస్తున్న 246 మంది దౌత్యవేత్తలు ఉన్నట్లు తెలిసింది. వీరికి లేఆఫ్ నోటీసుల జారీ మొదలైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నోటీసులు అందుకున్న దౌత్యవేత్తలు, సివిల్ సర్వెంట్లు 120 రోజులపాటు సెలవుల్లో ఉంటారని, ఆ తర్వాత అధికారికంగా ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు తెలిసింది. అయితే, వీరిలో ఎక్కువ మందికి 60 రోజుల సమయమే ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. శాఖల పునర్వ్యవస్థీకరణలో భాగంగా దౌత్య ప్రాధాన్యాలపై దృష్టి పెట్టామని తాజా నోటీసుల్లో పేర్కొన్నట్లు సమాచారం. ఈ ప్రణాళికను అధ్యక్షుడు ట్రంప్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోతోపాటు వీరి మిత్రపక్షాలు ప్రశంసిస్తున్నప్పటికీ.. ప్రస్తుత, మాజీ దౌత్యవేత్తలు మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విదేశాల్లో ఇప్పటికే ఉన్న ముప్పుతోపాటు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యాన్ని తాజా చర్యలు బలహీనపరుస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విభాగంలో ఉద్యోగాల కోతలను నిలిపివేయాలని కోరుతూ అమెరికన్ ఫారెన్ సర్వీసెస్ అసోసియేషన్ గత నెలలోనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విదేశీ సేవలందించే ఈ విభాగానికి అంతరాయం కలిగించడం జాతీయ ప్రయోజనాలను ప్రమాదంలో పడేస్తుందని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అమెరికన్లపై ప్రభావం పడుతుందని సంస్థ అధ్యక్షుడు టామ్ యజ్జ్‌గెర్డీ పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వ వ్యయాల తగ్గింపు ప్రణాళికలో భాగంగా పెద్ద ఎత్తున ఫెడరల్ ఉద్యోగులను ట్రంప్ యంత్రాంగం తొలగిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే యూఎస్ఎయిడ్, రెవెన్యూ సర్వీసెస్‌తోపాటు అనేక విభాగాల్లో భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించారు. అయితే, ట్రంప్ దూకుడుకు కొన్ని స్థానిక న్యాయస్థానాల్లో చుక్కెదురు కాగా.. ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఈ కోతలకు మార్గం సుగమం చేసింది.

## వలిగొండ నూతన ఎంపీడీవోగా
# జలంధర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



**వలిగొండ, రాజముద్ర న్యూస్:** వలిగొండ నూతన ఎంపీడీవో గా జలంధర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన జితేందర్ రెడ్డి నల్గొండ జిల్లా వేములపల్లికి బదిలీ కాగా జనగామ జిల్లా లింగాల గణపురం లో పనిచేస్తున్న జలంధర్ రెడ్డి వలిగొండ కి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కు మండలంలోని 37 గ్రామపంచాయితీల కార్యదర్శిలు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తానని, అన్ని వర్గాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



# ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు
## అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

- బోడుప్పల్‌లో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఎమ్మార్వో హసీనా తో కలిసి ప్రభుత్వ భూమిని పరిశీలించిన అదనపు కలెక్టర్
- ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మేడిపల్లి మండలంలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబరు 63 లో గల ప్రభుత్వ భూమిని, అసైన్డ్ ల్యాండ్ ను కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డితో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ... సర్వే నంబరు 63 లో గల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేడిపల్లి ఎంఆర్ఓ హసీనను ఆదేశించారు. అదే సర్వే నంబరులో గల అసైన్డ్ ల్యాండ్ ను కూడా అదనపు కలెక్టరు తనిఖీ చేసారు.



# గౌతమ్‌నగర్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత

- మేడిపల్లి ఎమ్మార్వో హసీనా ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం కూల్చివేత
- ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం : ఎమ్మార్వో హసీనా

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్ :** గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మేడిపల్లి మండల రెవెన్యూ అధికారిని షేక్ హసీనా హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ గౌతమ్ నగర్ లో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే.... బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 63/26 నుండి సర్వేనెంబర్ 63/39 గౌతమ్ నగర్ లో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని మేడిపల్లి తాహసిల్దార్ హసీనా ఆదేశాల మేరకు మేడిపల్లి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిబంధనలు అతిక్రమించి ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములకు జియో మ్యాపింగ్ చేస్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కీసర ఆర్డిఓ తో కలిసి ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో హసీనా, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
## మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్

- కాలనీ సమస్యలపై మాజీ మేయర్ తోటకూర అజయ్ కు వినతి పత్రం
- అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరిస్తా

**బోడుప్పల్, రాజముద్ర న్యూస్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాలనీలలో నెలకొన్న సమస్యలను ప్రణాళిక బద్ధంగా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ దేవేందర్ నగర్ కాలనీ ఫేజ్ - 2 లో గల సమస్యలపై డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జెన్న రాజు ఆధ్వర్యంలో మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కు దేవేందర్ నగర్ కాలనీ ఫేజ్ - 2 కాలనీ వాసులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ... కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకు వస్తే అధికారులతో మాట్లాడి మీ సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, అన్నారు. ఈ కార్యక్రమంలో దేవేందర్ నగర్ కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్, బైరుగొండ భూపాల్, బైరు మధు, బడిక సోములు, బీరప్ప, సాయి, నాగరాజు, రాజు, రాములు, హరిబాబు, సైదులు, రాజేష్, అనిల్, సోమయ్య, ఐలయ్య, జనార్ధన్ పాల్గొన్నారు.

# ఓ వరుణ దేవా.. ఇకనైనా కరుణించవా..!

- వర్షాలు కురవాలని బొడ్రాయికి జలాభిషేకం
- గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** వర్షాలు కురవాలని వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో మహిళలు బొడ్రాయికి బిందెలతో జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని వారు కోరుకున్నారు. వర్షాకాలం ప్రారంభమై నెల గడుస్తున్న అనుకున్నంత మేర వర్షాలు పడలేదు. విత్తనాలు వేసిన రైతులు ఆకాశం వైపు చూడడమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది రోజు పొలానికి పోయి "వరుణ దేవుడా కరుణించు" అని అడగడమే తప్ప ఏమి చేయలేకపోతున్నారు. దీనితో మండలంలోని పులిగిల్ల గ్రామ ప్రజలు వర్షాలు విస్తారంగా కురవాలని గ్రామంలో ఉన్న గ్రామదేవతలకి జలాభిషేకాలు



చేశారు ప్రతి ఇంటి నుండి ఒకరు బిందెలో నీళ్లు తీసుకుని గ్రామంలో ఉన్న ఆలయాలలోని దేవతామూర్తులకు అన్నింటికీ అభిషేకాలు జరిపించారు వర్షాలు కురిపించాలని వరుణదేవుని భజనలు పారాయణాలతో దైవ నామస్మరణ చేస్తూ దేవుళ్లను వేడుకున్నారు. ప్రతి ఏటా ఇలా చేయడంతోనే వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిపిస్తూ పంటలు ఎండిపోకుండా చేస్తున్నాడని నమ్మకంతో ఈ విధంగా జలాభిషేకం చేస్తున్నామని రైతులు తెలిపారు ఈ కార్యక్రమంలో కొంతం పుష్పమ్మ, పిన్నింటి ఉమారాణి, కంచి లావణ్య, కొంతం అలివేల,

# వీరన్న సొమ్ము ఆలయ సిబ్బందికే..!

- ఇష్టారీతిన అర్చకుల నియామకాలు..!
- భక్తుల సొమ్మును వృధా చేస్తున్న దేవదాయ శాఖ
- అసహనం వ్యక్తం చేస్తున్న వీరన్న భక్తులు



**భీమదేవరపల్లి, రాజముద్ర న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొత్తకొండ శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో అర్చక నియామకాలు ఇష్టారీతిన చేపడుతున్నారు. ఆలయంలో స్థాయికి మించి అర్చకులు ఉన్నప్పటికీ తాత్కాలిక అర్చకులను నియమిస్తూ ఆలయ ఆదాయాన్ని వృధా చేస్తున్నారు. ఆలయంలో పదవి విరమణ పొందిన అర్చకులతో పాటు, డిప్యూటేషన్ పై అర్చకులు విధులు నిర్వర్తించడం ముక్కున వేలేసుకునేలా చేస్తుంది. ఒక్కో అర్చకునికి లక్షల్లో జీతాలు ఇస్తూ, ఆలయానికి భారం పెంచుతున్నారు. భక్తులు దేవునికి సమర్పించే కానుకలను కేవలం జీతాలకు మాత్రమే సరిపెడుతున్నారు. అసలు ఆలయంలో శాశ్వత అర్చకులు, తాత్కాలిక అర్చకులు ఎంతమంది ఉన్నారో అనేదానిపై సందిగ్ధం నెలకొని ఉంది. వీరభద్ర స్వామికి నిత్య పూజల సేవలు అందించేందుకు ఇంత మంది అర్చకులు అవసరమా..? అని భక్తులు చర్చించుకుంటున్నారు. వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి కల్యాణ తంతు నిర్వహించేందుకు ఇతర దేవాలయాల నుంచి



అర్చకులు రావాల్సిందే. వీరన్న ఆలయం ఏ 6 కేటగిరిలో ఉంది. ఈ ఆలయానికి సూపరిండెంట్ స్థాయి కార్యనిర్వాహన అధికారి (ఈఓ)ని కేటాయించాల్సి ఉన్న సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీరన్న ఆలయంలోని అర్చకులు రాజకీయ నాయకులతో దోస్తీ కట్టి, నిత్యం వారితో సన్నిహితంగా ఉంటూ వారి సొంత పనులను పూర్తి చేసుకుంటున్నారనే విమర్శలు సైతం మండల వ్యాప్తంగా వ్యక్తం అవుతున్నాయి. దేవాలయ ఆవరణలో గతంలో ధ్వజస్తంభం ముందు ఓ రాజకీయ నాయకుడి ఫోటో పెట్టి పాలాభిషేకం నిర్వహించిన విషయంలో వీరన్న భక్తులు మండిపడ్డారు. వీరన్న ఆలయంలో జరిగే నిత్య కైంకర్యాలపై దేవదాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి భక్తుల సొమ్ము వృధా కాకుండా చూడాలని, స్థాయికి మించి అర్చకులను నియమించవద్దని భక్తులు, మండల ప్రజలు కోరుతున్నారు.





# ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవ వేడుకలు

- ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉమా గౌరి
- పాల్గొన్న రెవిన్యూ డివిజన్ల వైద్యాధికారులు, పిహెచ్సి, యుపిహెచ్సి వైద్య సిబ్బంది



**మేడ్చల్ రాజముద్ర న్యూస్ :** అంతాయిపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రపంచ జనాభా దినోత్సవం - 2025 సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి ఉమా గౌరీ హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. ఉమా గౌరి మాట్లాడుతూ..."జనాభా పెరుగుదల అంటే కేవలం గణాంకాలు కాదు, ఇది మన భవిష్యత్తు పట్ల ఉండవలసిన బాధ్యతను సూచిస్తుంది" అన్నారు. ఆమె అభిప్రాయపడుతూ, కుటుంబ నియంత్రణ మన సమాజ భద్రతకు, మాతా-శిశు ఆరోగ్యం మన భవిష్యత్ తరాల ఆరోగ్యానికి, గర్భనిరోధక



సాధనాల వినియోగం వ్యక్తిగత నిర్ణయాధికారానికి ప్రతిరూపంగా నిలుస్తాయని వివరించారు. పెరుగుతున్న జనాభా వనరులపై ఒత్తిడిని పెంచి ఆహారం, నీరు, ఆరోగ్యం, విద్య వంటి ప్రాథమిక అవసరాలపై ప్రభావం చూపుతోందని, దీని వలన నిరుద్యోగం, పేదరికం వంటి సమస్యలు తీవ్రమవు తున్నాయని అన్నారు. ఇలాంటి సందర్భాలలో ప్రతి ఒక్కరికీ సమర్థమైన ఆరోగ్య విద్య, ప్రణాళికబద్ధమైన కుటుంబ జీవితం మీద అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య శాఖలో విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకి మెరిట్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి, కీసర డివిజన్ ఉప జిల్లా వైద్యాధికారులు శోభ, సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు చంద్రకళ, గీత, మల్లేశ్వరి, కౌశిక్, సూపర్వైజర్లు ఎర్రగిన్నల విజయ్ కుమార్, లింగాల అక్షయ్ కుమార్, కమల్, జిల్లాలోని పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల వైద్య అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి జన్మదిన వేడుకలు

- ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని నీలిమ హాస్పిటల్ లో పాలు పండ్లు పంపిణీ చేసిన మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి




**పోచారం, రాజముద్ర న్యూస్ :** పోచారం మున్సిపల్ పరిధిలోని వెంకటాపురం నీలిమ హాస్పిటల్ లో జనగామ శాసనసభ సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బ్రెడ్డు ప్యాకెట్లు, పండ్లను పంపిణీ చేసిన పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. శుక్రవారం పోచారం మున్సిపల్ పరిధిలోని వెంకటాపురం నీలిమ హాస్పిటల్ లో పల్లా రాజేశ్వర్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి బ్రెడ్డు ప్యాకెట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... నీలిమ హాస్పిటల్ ను స్థాపించి పోచారం మున్సిపల్ పరిధిలోని నిరుపేదలకు 50 శాతం డిస్కౌంట్ కార్డులను అందిస్తూ 105 ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారని తెలిపారు. ప్రజలకు చేరువై జనగామ ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తూ పేదలకు అండగా యువతకు ఆదర్శంగా నిలుస్తున్న జనగామ శాసనసభ సభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## భూగర్భ డ్రైనేజీ పనులను
# త్వరితగతిన పూర్తి చేయాలి
## మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

- కాలనీవాసులతో కలిసి అయోధ్య నగర్ నుండి సుమ కాలనీ మీదుగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మొదటి డివిజన్ లో సుమారు రూ.80 లక్షల వ్యయంతో అయోధ్య నగర్ నుండి సుమ కాలనీ మీదుగా చెరువు వరకు చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పైపులైన్ పనులలో వేగం పెంచాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధికారులను కోరారు. కాలనీ ప్రజలతో కలిసి పనులను పరిశీలించారు. వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని, అలాగే కాలనీ పరిధిలోని ప్రజలు తమ తమ ఇండ్లకు వ్యక్తిగత లైన్లను అధికారుల, కాంట్రాక్టర్ సమన్వయంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఎంతటి వరదలు వచ్చినా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో అయోధ్య నగర్, సుమ కాలనీ ప్రజలకు వరద నీటి సమస్య తలెత్తదన్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. అలాగే సీసీ రోడ్డు పునర్నిర్మాణం పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల, బీఆర్ఎస్ నాయకులు, సుమ కాలనీ అధ్యక్షులు పన్నాభాయ్, ఖైసర్, అక్షిత్ యాదవ్, శ్యామ్ రావు, చంద్రశేఖర్, శరత్, అనిల్, బాబూరావు, రామకృష్ణ రావు, జ్యోతి, శారదా తదితరులు పాల్గొన్నారు.



## బోనాల పండుగకు
# మెరుగైన ఏర్పాట్లు చేయండి
## మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

- పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బోనాల పండుగకు ముందస్తు ఏర్పాట్లపై బీఆర్ఎస్ పార్టీ విజ్ఞప్తి
- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత

**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్ :** బోనాల పండుగను పురస్కరించుకొని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న అమ్మవార్ల ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వరరావు కు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20వ తేదీన బోనాల పండుగ జరగనున్న నేపథ్యంలో, ప్రజల ఆత్మీయతకు అద్దంపట్టే విధంగా ఆలయాల వద్ద పూల అలంకరణ, రంగుల వెలిగింపులు, విద్యుత్ దీపాలు, శబ్ద వ్యవస్థల ఏర్పాట్లు చేయాలని పార్టీ నాయకులు కోరారు. ముఖ్యంగా మహిళలు, భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగలో పాల్గొనే విధంగా ఆలయాల వద్ద పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయాలు, తాత్కాలిక శౌచాలయాలు ఏర్పాటు చేయాలని, దేవాలయాలకు వెళ్లే రహదారులపై గుంతలు పూడ్చి, స్ట్రీట్ లైట్లను పునరుద్ధరించాలని కమిషనర్‌ను కోరారు. పీర్జాదిగూడ నగర బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లేతకుల మాధవి రఘుపతి రెడ్డితో కలిసి మున్సిపల్ కమీషనర్ త్రిలేశ్వర్ రావుకు వినతిపత్రం అందచేశారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించిన తీరును గుర్తుచేసిన బీఆర్ఎస్ నాయకులు, ఈ ఏడాది కూడా అదే ఉత్సాహంతో, ప్రజల మనోభావాలకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని కోరా రు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా, బాలరాజు, యాసారం శ్రీనివాస్, కోనేటి వెంకట్, పింగళి జోగిరెడ్డి, గడీల జగన్ రెడ్డి, శ్యామల నరసింహ, అశోక్, సతీష్, మల్లం వెంకటేష్ గౌడ్, ఉపేందర్, కిరణ్ నాయక్, శంకర్ రావు, పాశం నరేందర్, కిరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.




# కణిక ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

**ఎల్బీనగర్, రాజముద్ర న్యూస్:** హైదరాబాద్ కణిక సాహిత్యం సామాజిక సేవ విద్యారంగా వేదిక, అధ్యక్షులు రమాదేవి కులకర్ణి, కణిక ప్రధాన కార్యదర్శి విజయ కులకర్ణి, గురు పౌర్ణమి పురస్కరించుకొని హైదరాబాద్ ఎల్బీ నగర్ లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి విజయ మాట్లాడుతూ.. మనకు ఉన్నంతలో ఇతరులకు సేవ చేయడంలో ఆనందం ఉంటుందని సుమారు 500 మందికి అన్నదానం చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కణిక కార్యవర్గ సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## ఆర్థిక సహాయం అందించిన ఏజేఆర్ ఫౌండేషన్

**వలిగొండ రాజముద్ర న్యూస్:**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన కర్రె రామకృష్ణ పెద్ద కుమారుడు కర్రె హరేంద్ర మరణించడం జరిగింది. నిరుపేద కుటుంబం కావడంతో వారికి ఏజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఏజేఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు



## స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే
## దమ్ములేని రేవంత్ రెడ్డి సర్కార్

**ఆత్మకూరు( ఎం) రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం) మండల కేంద్రంలోని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో భారత రాష్ట్ర సమితి మండల పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ కోటా 42 శాతం బిల్లు పార్లమెంటులో ఆమోదింపజేసి, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని అలా చేయకుండా రాష్ట్ర మంత్రివర్గం చే ఆర్డినెన్స్ తీసుకువచ్చిన తెలంగాణలోని బీసీలను అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం ని బిఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కె. హెచ్. ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరే బిక్షపతి, మాజీ ఎంపీటీసీ యాస కవిత, మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ, యువజన, విద్యార్థి విభాగం అధ్యక్షులు ప్రతి కంఠం శాంతన్ రాజు, చుంచు నాగరాజు, సింగారం మాజీ ఎంపిటిసి పల్లెర్ల సత్యనారాయణ, కొరటికల్ మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్, మండల ఉపాధ్యక్షులు గుద్దేటి శ్రీనివాస్,యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దుంప పరుశురాములు, సీనియర్ నాయకులు నాతి స్వామి గౌడ్, మహేందర్ రెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎలగందుల విజయ్, విద్యార్థి నాయకులు గడ్డం సతీష్, నాతి మల్లికార్జున్, యాట మల్లేష్, ఎర్ర నవీన్ రెడ్డి మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఎస్సీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ని ప్రారంభించాలి

- వేసవి హాలిడేస్‌లోనే పోస్టెమెట్రిక్ హాస్టల్ నూతన భవనాన్ని చూడాల్సింది
- పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మండల కేంద్రంలో ఉన్న బాలికల కళాశాల వసతి గృహాన్ని, విద్యార్థి సంఘాల నాయకుల చొరవతో 2018 లో చేవెళ్ల ప్రాంతానికి ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి నుండి 2024 వరకు ఓ అద్దె భవనంలో కొనసాగించారు. అనంతరం దానిని ఖాళీ చేసి కొన్ని రోజులు ప్రీ మెట్రిక్ బాలికల వసతి గృహంలో కొనసాగించారు. ప్రస్తుతం అందులో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉ ఒడటంతో ఇబ్బంది ఏర్పడింది. కాబట్టి ఇప్పుడు ఆ భవనాన్ని ఖాళీ చేయడం జరిగింది. విద్యార్థుల కోసం నూతన భవనాన్ని గత రెండు నెలల వేసవి సెలవుల రోజుల్లోనే అధికారులు నూతన భవనాన్ని చూసి విద్య అకాడమిక్ కి ముందే హాస్టల్ ను ప్రారంభించి విద్యార్థులను అడ్మిషన్స్ చేసుకోవాలి కానీ, సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు వివిధ కళాశాలలో అడ్మిషన్లు తీసుకొని హాస్టల్ వసతి కోసం అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి బాలికల పోస్టెమెట్రిక్ హాస్టల్ ని వెంటనే ప్రారంభించి విద్యార్థులను అడ్మిషన్ చేసుకోవాలని పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ అన్నారు.



## ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే
## సంపత్ కుమార్‌కు గణ సన్మానం

**భువనగిరి రాజముద్ర న్యూస్:**ఉమ్మడి నల్లగొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గా నియమితులై మొదటిసారిగా వస్తున్న సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సంపత్ కుమార్ కు ఐ ఎన్ టి యు సి పట్టణ అధ్యక్షులు సంపత్ యువసేన రాష్ట్ర అధ్యక్షులు దండు నరేష్ టోల్ ప్లాజా వద్ద శాలువాతో సన్మానించడం జరిగింది.

# ఘనంగా 'దక్షిణ్ సంవాద్'
## హైదరాబాద్‌లో ముగిసిన వేడుకలు

- అనుసంధాన, సరళ, సామరస్యాల భాషగా హిందీకి గుర్తింపు
- అధికార భాషా విభాగం స్వర్ణోత్సవ సంబురాలు..



**హైదరాబాద్, జూలై 11, రాజముద్ర న్యూస్ :** కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని అధికార భాషా విభాగం స్వర్ణోత్సవాల్లో భాగంగా 'దక్షిణ సంవాద్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా హరివంశ్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ప్రొఫెసర్ మాణిక్యాంబ, హిందీ పరిశోధకులు, తెలంగాణ ప్రొఫెసర్ అనంత కృష్ణన్, హిందీ పరిశోధకులు, తమిళనాడు డాక్టర్ మీనాక్షి జాలీ, సంయుక్త కార్యదర్శి, అధికార భాషా విభాగం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో భాషా సామరస్యాన్ని, బహుభాషా చేతనను, హిందీ భాష నిరంతర పురోగతిని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. అధికార భాషా విభాగం కార్యదర్శి అన్షులి ఆర్య స్వాగతోపన్యాసం చేస్తూ.... "దేశవ్యాప్తంగా హిందీని అధికార భాషగా స్వీకరించాం కాబట్టే, నేటి దక్షిణ సంవాద్ వేడుకను దక్షిణ భారతదేశంలో నిర్వహించుకుంటున్నాం. ఇది కేవలం ఓ కేంద్ర కార్యక్రమంగా మాత్రమే మిగిలిపోకూడదు. దీన్ని దేశవ్యాప్తంగా నిర్వహించాలి. ఆ స్ఫూర్తితోనే- చారిత్రకంగా, సాంస్కృతికంగా సుసంపన్నమైన హైదరాబాద్ గడ్డపై నేడు మనం సమావేశమయ్యాం. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఆంగ్ల భాషల స్వరాలన్నీ ఉమ్మడిగా ప్రతిధ్వనించే హైదరాబాద్ కేవలం ఓ నగరం మాత్రమే కాదు, భారతదేశ బహుభాషా స్ఫూర్తికి ప్రతిబింబం" అని వ్యాఖ్యానించారు. "1975 జూన్ 26న అధికార భాషా విభాగాన్ని నెలకొల్పారు. ఈ ప్రస్థానంలో ఎందరో పండితులు, అధికారులు, నిబద్ధత కలిగిన కార్యకర్తల సహకారం మరువలేనిది. వారిలో కొందరు భౌతికంగా మనతో లేకపోయినా వారి జ్ఞాపకాలు, కృషి ఎన్నటికీ నిలిచే ఉంటాయి. ప్రభుత్వానికి తొలి అధికార భాషా సలహాదారు అయిన విఖ్యాత కవి రాంధారి సింగ్ దింకర్ ను మనం ప్రత్యేకంగా స్మరించుకోవాలి. హిందీకి అనుకూలంగా ఆయన పార్లమెంటులో నిర్భయంగా గొంతెత్తారు." అని ఆమె పేర్కొన్నారు. ఆ శాఖ 50 ఏళ్ల ప్రస్థానాన్ని ఆమె వివరించారు. "ప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించేలా విధానాలు, నియమ నిబంధనలు, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక సౌలభ్యాన్నీ కల్పిస్తూ అధికార భాషా విభాగం ఎంతగానో కృషిచేసింది. అధికార భాషపై పార్లమెంటరీ కమిటీ చేసిన పర్యవేక్షణ వీటిని వేగవంతం చేసింది. 'మంత్ర', 'లీల', 'ఇ-మహాశబ్దకోశ్', ఇప్పుడు 'కంఠస్త్' వంటి కార్యక్రమాలు ఈ విభాగాన్ని సాంకేతికంగా బలోపేతం చేశాయి. 2014 తర్వాత ఈ ప్రయత్నాలు మరింత ఊపందుకున్నాయి" అని తెలిపారు. ఈ అంశంలో ప్రధానమంత్రి పాత్రనూ ఆమె వివరిస్తూ... " ప్రధానమంత్రి దేశవిదేశాల్లో హిందీలో చేసిన సరళమైన, ప్రభావవంతమైన, ఉత్తేజభరితమైన ప్రసంగాల వల్ల హిందీపై యువత దృక్పథంలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. 'అభివృద్ధి చెందిన భారత్' కోసం ఆయన అయిదు ప్రతిజ్ఞలకు పిలుపునిచ్చారు. అందులో బానిస మనస్తత్వం నుంచి విముక్తి, మన సాంస్కృతిక వారసత్వాన్ని గర్వించడం- వాటిలో ముఖ్యం. ఈ రెండూ అధికార భాషా విభాగానికి నిరంతరం స్ఫూర్తిని అందించాయి" అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్య అతిథి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నగరాన్ని ఎంపిక చేసినందుకు హోం మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. "ఈ యాభై ఏళ్లలో అధికార భాషా విభాగం విశేషంగా కృషి చేసింది. హిందీని ప్రోత్సహించడం ప్రతీ భారతీయుడి ప్రథమ కర్తవ్యం" అని వ్యాఖ్యానించారు. "విదేశీ భాషలు నేర్చుకోగలిగే మనం హిందీ విషయంలో ఎందుకు సంకోచించాలి? హిందీ దేశమంతటా సులభంగా అర్థమయ్యే భాష. నేను సోషల్ మీడియాలో హిందీని ఉపయోగిస్తాను. అధికార భాషా విభాగం స్వర్ణోత్సవ సందర్భంగా హిందీని ప్రేమిద్దాం, స్వీకరిద్దాం, ప్రోత్సహిద్దాం... ఈ దిశగా దృఢంగా సంకల్పిద్దాం" అని గౌరవ అతిథి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను స్మరించుకుంటూ.. "భాష హృదయాలను కలిపేదిగా ఉండాలి. ఈ కోణం నుంచి హిందీని చూద్దాం" అని ఆయన అన్నారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ.. "హిందీ మాతృభాష కాని వారి నుంచే ఆ భాషను ప్రోత్సహించాలన్న ప్రేరణ వచ్చింది. నేడు ప్రధాని, హోం మంత్రి ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు" అని పేర్కొన్నారు. ప్రొఫెసర్ మాణిక్యాంబ మాట్లాడుతూ.. "నా 55 ఏళ్ల పదవీకాలంలో అధికార భాష వికాసానికి ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాను. అన్ని భాషల స్వరాలన్నీ కలిసి అధికార భాషా వీణ ప్రతిధ్వనిస్తోంది" అని వ్యాఖ్యానించారు. ప్రొఫెసర్ అనంత కృష్ణన్ మాట్లాడుతూ.. "తమిళనాడుకు ప్రతినిధిగా నేనిక్కడ ఉన్నాను. హిందీకి అనుకూలమైన వాతావరణం అక్కడ రూపొందుతోందని సగర్వంగా చెప్తున్నాను" అన్నారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్), ఓఎన్జీసీ (ఎంఆర్పీఎల్), తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయం, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఇండియన్ బ్యాంక్, సెంట్రల్ హిందీ ఇనిస్టిట్యూట్ లకు చెందిన హిందీ ప్రచురణలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ ఏడాది జూన్ 26 నాటికి అధికార భాషా విభాగానికి 50 ఏళ్లు పూర్తవడం విశేషం. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన మొదటి స్వర్ణోత్సవాల్లో భాగంగా.. అనేక గ్రంథాలను ఆవిష్కరించి ఆ శాఖ సాధించిన విజయాలను ప్రముఖంగా చాటారు. కేవలం విధానపరమైన ప్రక్రియలకే కాకుండా దేశ ప్రతిష్ఠ, చైతన్యాన్ని చాటే స్థాయికి అధికార భాషా విభాగం చేరిందని ఈ కార్యక్రమం స్పష్టం చేసింది. ఇటీవల జీ 20 అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సులకు వేదికైన భారత్ మండపం.. నేడు హిందీ, ఇతర భారతీయ భాషల ప్రచారానికి స్ఫూర్తినిచ్చే వేదికగా నిలుస్తోంది. ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ.. స్వర్ణోత్సవాల్లో రెండో ప్రధాన కార్యక్రమమైన 'దక్షిణ సంవాద్'ను జూలై 11న హైదరాబాదులో నిర్వహించారు. దక్షిణ భారత భాషా, చారిత్రక వైవిధ్యంలో వేళ్లూనుకుని ఉన్న సామరస్య దృక్పథానికి వేదికగా నిలిచింది. స్వర్ణోత్సవాలు ఢిల్లీకే పరిమితం కాదని, జాతీయ వేదికగా నిలిచాయని ఈ కార్యక్రమం రుజువు చేసింది. సంభాషణల్లో దేశవ్యాప్తంగా ఐక్యతా శక్తిగా హిందీ నేడు కీలక పాత్ర పోషిస్తోంది. కేంద్ర అధికార భాషా సేవల సచివాలయం, ఢిల్లీలో దాని పరిధిలోని ఆధీన కార్యాలయ అధికారులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలను ఈ సందర్భంగా సన్మానించారు. భోజనానంతర చర్చా కార్యక్రమంలో.. తెలుగు పరిశోధకులు ప్రొఫెసర్ మాణిక్యాంబ, ప్రొఫెసర్ అన్నపూర్ణ చర్ల, కన్నడ పరిశోధకులు టి.ఆర్. భట్, తమిళ పరిశోధకులు అనంత కృష్ణన్ భారతీయ భాషలకూ హిందీకీ మధ్య సామరస్యంపై ప్రసంగించారు. వక్తలంతా హిందీపట్ల ప్రేమను వ్యక్తం చేశారు. మరింత సామరస్య భారత్ ను సాధించేందుకు హిందీని ఒక మార్గంగా స్వీకరించడం, ప్రోత్సహించడంపై నిబద్ధతను పునరుద్ఘాటించారు. సదస్సు ముగింపు సందర్భంగా భారత భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటుతూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం అందరినీ ఆకట్టుకున్నది.




## బోగస్ విలేకరులను ఏరివేసేందుకు కఠిన నిర్ణయం
### జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి

### - బోగస్ విలేకరులపై నియంత్రణ కోసమే.. స్టాండింగ్ కమిటీ లో చర్చ విషయంలో స్పష్టత ఇచ్చిన మేయర్

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** మీడియా ముసుగులో కొంత మంది బోగస్ విలేకరులు జిహెచ్ఎంసి అధికారులను, భవన నిర్మాతలను, సాధారణ ప్రజలను, పేదలను తీవ్రస్థాయిలో వేధింపులు గురి చేయడంతో పాటు బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్న బోగస్ నకిలీ రిపోర్టర్ల బెడద నుంచి కాపాడాలని, జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ లో అన్ని పార్టీల సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు లేవనెత్తిన నకిలీ విలేకరుల సమస్య నగరం మొత్తం తీవ్రంగా ఉంది. ప్రతిరోజు ఈ అంశంపై అనేక ఫిర్యాదులు ప్రజా ప్రతినిధులకు వస్తున్నాయి. నకిలీ విలేకరులు జీ హెచ్ ఎం సి జోనల్.. సర్కిల్ కార్యాలయాల్లో తిష్టవేస్తూ అధికారులను సైతం అనేక రకాలుగా వేధిస్తున్నారని అన్ని సర్కిల్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఈ మేరకు స్టాండింగ్ కమిటీ సభ్యుల డిమాండ్ మేరకు త్వరలో బోగస్ విలేకరులను ఆయా సర్కిల్ కార్యాలయాల్లో.. ప్రధాన కార్యాలయాల్లో రాకుండా చూడాలి అని సభ్యులు తీర్మానం చేయాలని కోరారు. అయితే అలాంటి నియంత్రణలు ఎలాంటి ప్రభుత్వ గుర్తింపులు లేకుండా అరాచకాలు సృష్టిస్తున్న బోగస్ మీడియాకు మాత్రమే వర్తిస్తుంది. గుర్తింపు పొందిన మీడియా సంస్థలకు, గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులకు అడ్డంకులు కల్పించాలన్నది జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఉద్దేశం కాదని స్పష్టంగా వివరించారు.




**పారదర్శక విధానాలను పాటించడమే జిహెచ్ఎంసి లక్ష్యం.**

బోగస్ నకిలీ విలేకరుల బెడదను కొంతైనా తగ్గించే ప్రయత్నంలో భాగంగా జీ హెచ్ ఎం సి స్టాండింగ్ కమిటీ తీసుకునే చర్యలకు గుర్తింపు పొందిన మీడియా సంస్థలు, నిజమైన విలేకరులు మద్దతు పలుకుతారని ఆశిస్తున్నాము. ఈ వ్యవహారంలో గుర్తింపు పొందిన మీడియా సంస్థలు, ప్రతినిధులు ఎలాంటి అపోహలకు గురికావద్దని కోరుతున్నామని తెలిపారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఎలాంటి చర్యలకు జిహెచ్ఎంసి పాల్పడబోదని, అయితే అధికారుల విధులకు భంగం కలగకుండా ఉండేందుకు,. నిర్ణీత సమయంలో మాత్రమే కలుసుకునే విధంగా పి ఆర్ ఓ వ్యవస్థను సర్కిల్/ జోనల్ కార్యాలయాల్లో కూడా బలపరచి, వారి ద్వారా సమాచారం ఇవ్వాలనేది స్టాండింగ్ కమిటీ సభ్యుల ఉద్దేశ్యం అని అన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన
## కేఎచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి

**ఆత్మకూర్ (ఎం )రాజముద్ర న్యూస్ :** ఆత్మకూరు (ఎం), మండలం పల్లెర్ల గ్రామంలో దండు నర్సయ్య ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న కేఎచ్ఆర్ ఫౌండేషన్ అధినేత బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు 5000 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్,జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరే బిక్షపతి, మాజీ ఎంపీటీసీ యాస కవిత, మహిళా అధ్యక్షురాలు సోలిపురం అరుణ, యువజన, విద్యార్థి విభాగం అధ్యక్షులు ప్రతి కంఠం శాంతన్ రాజు, చుంచు నాగరాజు,పల్లెర్ల మాజీ సర్పంచ్ నాయిని నర్సింహారెడ్డి, సింగారం మాజీ ఎంపిటిసి పల్లెర్ల సత్యనారాయణ, కొరటికల్ మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్, మండల ఉపాధ్యక్షులు గుద్దేటి శ్రీనివాస్,యువజన



విభాగం ప్రధాన కార్యదర్శి దుంప పరుశురాములు, సీనియర్ నాయకులు నాతి స్వామి గౌడ్, మహేందర్ రెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఎలగందుల విజయ్, విద్యార్థి నాయకులు గడ్డం సతీష్, నాతి మల్లికార్జున్, యాట మల్లేష్, ఎర్ర నవీన్ రెడ్డి,నరేష్, అర్జున్, శశి,ఉదేశ్, నవీన్,హరి, సాయి,మహేశ్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన
## 22 మంది మావోయిస్టులు

**చర్ల:** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో 22 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిలో 14 మంది పురుషులు, 8 మంది మహిళలు ఉన్నారు. బస్తర్ డివిజన్‌లో భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధానం వల్ల ప్రభావితమై పెద్ద సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోతున్నారు. ఈ క్రమంలోనే నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ ప్రాంతంలో చురుగ్గా ఉన్న 22 మంది గురువారం ఎస్పీ రాబిన్సన్ గుడియా ముందు లొంగిపోయారు. వీరిలో కుతుల్ ఏరియా కమిటీ కమాండర్ సుఖ్‌లాల్ కూడా ఉన్నారు. ఈ విషయాన్ని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. ఈ 22 మంది మావోయి స్టులపై మొత్తం రూ. 37 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు.



## నీటి సరఫరా పునరుద్ధరణకు
## సహకరించిన రేగు మల్లేశం

### - రేగు మల్లేశమును అభినందించిన గ్రామస్తులు

**వలిగొండ రాజముద్ర న్యూస్:**వలిగొండ మండలంలోని నెమలి కాలువ గ్రామంలో నల్లా నీటి సరఫరా కి ఉపయోగించే రెండు బోరు మోటార్లు పాడవడంతో గత కొన్ని రోజులుగా నల్లా నీటి సరఫరా ఆగిపోవడం జరిగింది. తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొన్న గ్రామస్థులు ఈ విషయాన్ని ప్రజా సమస్యలపై స్పందిస్తున్న రేగు మల్లేష్ దృష్టికి తీసుకురావడం జరిగింది. గ్రామస్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రేగు మల్లేష్ గతంలో రిపేర్ చేయించిన మోటార్లను వెంటనే మళ్లీ తన స్వంత నిధులతో రిపేర్ చేయించి ఇవ్వడమే కాకుండా స్వయంగా తన పర్యవేక్షణలో వాటిని మళ్లీ బిగించి వాడుకలోకి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థులు వారి నీటి సమస్యను తన దృష్టికి తీసుకురాగానే ఎన్నో సార్లు పరిష్కరించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ రేగు మల్లేశంను అభినందించడం జరిగింది.

# రాణించిన రాహుల్.. భారత్ 145/3

## ఇంగ్లాండ్ 387 ఆలౌట్ బుమ్రాకు 5 వికెట్లు

**లార్డ్స్ :** 1-1తో సమంగా ఉన్న సిరీస్‌లో పైచేయి సాధించాలని పట్టుదలతో ఉన్న భారత్, ఇంగ్లాండ్.. లార్డ్స్‌లో హోరాహోరీగా తలపడుతున్నాయి. మ్యాచ్‌లో ఆధిపత్యం చేతులు మారుతూ సాగుతోంది. 251/4తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌటైంది. జస్‌ప్రీత్ బుమ్రా (5/74) సిరీస్‌లో రెండో 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. జో రూట్ (104బీ 199 బంతుల్లో 10ఐ4) సెంచరీ పూర్తి చేయగా.. జేమీ స్మిత్ (51బీ 56 బంతుల్లో 6ఐ4), బ్రైడన్ కార్స్ (56బీ 83 బంతుల్లో 6ఐ4 1ఐ6) అర్ధశతకాలతో జట్టుకు మెరుగైన స్కోరునందించారు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన భారత్ రెండో రోజు ఆట చివరికి 145/3తో నిలిచింది. రాహుల్ (53 బ్యాటింగ్‌బీ 113 బంతుల్లో 5ఐ4) చక్కగా బ్యాటింగ్ చేస్తున్నాడు. అతడికి తోడుగా పంత్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

### పడి.. లేచి..

తొలి రెండు టెస్టుల్లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన భారత బ్యాటర్లు.. లార్డ్స్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తారా అని చూస్తే, ఇక్కడ అంత తేలిక కాదని ఆరంభంలోనే అర్థమైపోయింది. తొలి ఓవర్లోనే మూడు ఫోర్లు కొట్టి యశస్వి జైస్వాల్ (13) ఊపుమీద కనిపించాడు కానీ.. తర్వాతి ఓవర్లోనే అతడిని పెవిలియన్‌కు పంపించేశాడు ఆర్చర్. బంతి ఎడ్జ్ తీసుకుని స్లిప్‌లో బ్రూక్ చేతిలో పడింది. అయితే మరో ఓపెనర్ రాహుల్ (%ఖూ =ఖుష్ట్రబశ్రీ%) మాత్రం గొప్ప పట్టుదలతో క్రీజులో నిలిచి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. అతడికి తోడైన కరుణ్ నాయర్ (40బీ 62 బంతుల్లో 4ఐ4) దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. సిరీస్‌లో పెద్ద స్కోర్లు చేయకపోయినా.. కరుణ్‌లో ఆత్మవిశ్వాస లోపం కనిపించలేదు. ఇంగ్లిష్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. అర్ధశతకం దిశగా దూసుకెళ్తున్న అతడికి ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ బ్రేక్ వేశాడు. ఆ తర్వాత రాహుల్‌కు శుభ్‌మన్ తోడయ్యాడు. ఇద్దరూ వికెట్ ఇవ్వకూడదన్న పట్టుదలను ప్రదర్శించారు. భారత్ 2 వికెట్లతోనే రోజును ముగించేలా కనిపించింది. కానీ సిరీస్‌లో పరుగుల వరద పారిస్తున్న భారత కెప్టెన్.. ఈసారి తక్కువ స్కోరుకే పరిమితం అయ్యాడు. గిల్ (16)ను వోక్స్ ఔట్ చేసి ఇంగ్లాండ్‌ను సంబరాల్లో ముంచెత్తాడు. ఆఖర్లో ఒకట్రెండు వికెట్లు పడగొడితే మ్యాచ్‌పై పట్టు లభిస్తుందని ఇంగ్లిష్ బౌలర్లు గట్టిగానే ప్రయత్నించారు. కానీ రాహుల్, పంత్ అవకాశమివ్వలేదు. వేలి గాయంతో వికెట్ కీపింగ్‌కు దూరమైన పంత్ .. బ్యాటింగ్‌కు వచ్చి అభిమానులకు ఉపశమనాన్నిచ్చాడు. తనదైన శైలిలో షాట్‌లు ఆడి అలరించాడు. రెండో రోజు ఆటను భారత్ కొంచెం సంతృప్తికరంగానే ముగించింది.



### బూమ్ బూమ్..

అంతకుముందు 251/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఇంగ్లాండ్‌ను బుమ్రా ఆరంభంలో గట్టి దెబ్బే తీసినా.. ఆ జట్టు అనుకున్న దాని కంటే ఎక్కువ స్కోరే చేసింది. 5 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సిరాజ్ బౌలింగ్‌లో జేమీ స్మిత్ ఇచ్చిన తేలికైన క్యాచ్‌ను స్లిప్‌లో రాహుల్ వదిలేయడంతో భారత్ మూల్యం చెల్లించుకుంది. అతను అర్ధశతకం సాధించాడు. దిగువ వరుస బ్యాటర్లకు కళ్లెం వేయలేని బలహీనతను సొమ్ము చేసుకుంటూ బ్రైడన్ కార్స్ కూడా అర్ధసెంచరీ కొట్టాడు. దీంతో ఇంగ్లాండ్ సంతృప్తిగానే ఇన్నింగ్స్‌ను ముగించింది. రెండో రోజు మొత్తం 29.3 ఓవర్లు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. 6 వికెట్లు కోల్పోయి 136 పరుగులు చేసింది. తొలి రోజు పెద్దగా ప్రభావం చూపలేకపోయిన బుమ్రా.. రెండో రోజు మాత్రం అదరగొట్టాడు. ఉదయం ఆటంతా అతడిదే. ఓవర్‌నైట్ బ్యాటర్ స్టోక్స్ (44)ను బుమ్రా బౌల్డ్ చేశాడు. స్టోక్స్ ముందు రోజు స్కోరుకు 5 పరుగులే జోడించాడు. గురువారం 99 పరుగులపై నిలిచిన రూట్.. శుక్రవారం వెంటనే సెంచరీ పూర్తి చేసినా, ఎక్కువసేపు నిలవలేకపోయాడు. బుమ్రా అతణ్ని అద్భుతమైన బంతితో బౌల్డ్ చేశాడు. మరోవైపు వోక్స్ (0) సైతం బుమ్రా బంతికి తాళలేక బౌల్డ్ కావడంతో ఇంగ్లాండ్ 271/7తో పతనం దిశగా సాగుతున్నట్లు అనిపించింది. కానీ ఈ దశలో జేమీ స్మిత్, కార్స్ జోడీ కీలక భాగస్వామ్యంతో ఇంగ్లాండ్‌ను ఆదుకుంది. ఆరంభంలోనే ఔటయ్యే ప్రమాదం తప్పించుకున్న స్మిత్.. ఆ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకున్నాడు. ఇద్దరూ ధాటిగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లంచ్‌కు ఇంగ్లాండ్ 353/7తో నిలిచింది. అయితే విరామం తర్వాత భారత బౌలర్లు పుంజుకున్నారు. చకచకా మూడు వికెట్లు తీసి ఇంకో 34 పరుగులకే ఇన్నింగ్స్‌ను ముగించారు.



## నితీశ్ విషయంలో ఆ ఆలోచనే వద్దు

### మేనేజ్‌మెంట్‌కు కుంబ్లే సూచన

ఇంగ్లాండ్‌తో లార్డ్స్ టెస్టులో తొలి రోజు భారత్ తరఫున తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి హీరో అనడంలో సందేహమే లేదు. బుమ్రా, సిరాజ్, ఆకాశ్ దీప్ ఎంత ప్రయత్నించినా ఆరంభంలో వికెట్ తీయలేకపోయారు. కానీ, వచ్చీ రావడంతోనే ఒకే ఓవర్‌లో నితీశ్ ఇంగ్లాండ్ ఓపెనర్లను వెనక్కి పంపాడు. ఆ తర్వాత ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్ నెమ్మదిగా నడిచింది. రూట్, బెన్ స్టోక్స్ వంటి టాప్ బ్యాటర్లను కూడా నితీశ్ తన బౌలింగ్‌తో ఇబ్బందిపెట్టాడు. గత ఆస్ట్రేలియా సిరీస్‌లో అదరగొట్టిన నితీశ్‌కు మేనేజ్‌మెంట్ అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లే కీలక సూచనలు చేశాడు. అతడి విషయంలో వేటు వేయడం, మార్పులు చేయడం చేయొద్దని పేర్కొన్నాడు. "నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌ను చూసి సర్‌ప్రైజ్‌కు గురయ్యా. నిలకడగా సరైన ప్రాంతాల్లో బంతిని సంధించాడు. తొలి వికెట్ లెగ్‌సైడ్ గిఫ్ట్‌గా వచ్చిందనుకున్నా.. రెండోది మాత్రం సూపర్ డెలివరీతోనే రాబట్టాడు. జాక్ క్రాలీకి చక్కటి బంతి సంధించి పెవిలియన్‌కు పంపాడు. జడేజా బౌలింగ్‌లో పోప్ ఇచ్చిన క్యాచ్‌ను ధ్రువ్ జురెల్ చక్కగా ఒడిసిపట్టాడు. జస్‌ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేసినా ఎక్కువ వికెట్లు రాలేదు. అతడిని అడ్డుకోవడంపై ఇంగ్లాండ్ బ్యాటర్లు ఎక్కువ దృష్టిపెట్టారు. కానీ, కీలకమైన బ్రూక్‌ను ఔట్ చేశాడు" అని కుంబ్లే వెల్లడించాడు.

### ఆ ఫిట్‌నెస్ సూపర్..

"నితీశ్ తొలిరోజు 14 ఓవర్లు వేశాడు. ఇంకా వేసేంత ఫిట్‌నెస్ అతడి సొంతం. కుర్రాడు కావడంతో నియంత్రణతో బౌలింగ్ చేశాడు. ఆసీస్ పర్యటనలో సెంచరీ చేసి అందరి దృష్టిలో పడ్డాడు. ఆ సిరీస్‌లో ఎక్కువ వికెట్లు రాకపోయినా భాగస్వామ్యాలను విడదీసేలా బౌలింగ్ చేయగల సమర్థుడని ఇప్పుడు నిరూపించుకున్నాడు. ఫీల్డింగ్‌లోనూ చురుగ్గా ఉండటం తప్పకుండా నితీశ్‌కు కలిసొచ్చే అంశం. అందుకే, అతడి విషయంలో మాత్రం వేటు వేయడం, పక్కన పెట్టడం వంటివి చేయొద్దు. అవకాశాలు ఇస్తూ ఆడించాలి" అని కుంబ్లే వ్యాఖ్యానించాడు.



## ప్రైమ్ డే సేల్..

### ఫైర్‌టీవీ స్టిక్, స్మార్ట్‌టీవీలపై డిస్కౌంట్

సాధారణ టీవీని స్మార్ట్‌టీవీలా మార్చేందుకు ఉపయోగించే ఫైర్‌టీవీ స్టిక్‌లపై అమెజాన్ ఆఫర్లు ప్రకటించింది. ఈ నెల 12 నుంచి 14 వరకు జరిగే ప్రైమ్ డే సేల్‌లో వీటిపై డిస్కౌంట్ అందిస్తోంది. దీంతో పాటు ఫైర్‌టీవీ ఓఎస్‌తో పనిచేసే టీవీలపైనా డిస్కౌంట్లు అందిస్తున్నట్లు అమెజాన్ పేర్కొంది. అలెక్సా వాయిస్ రిమోట్ కలిగిన ఫైర్‌టీవీ స్టిక్ హెచ్‌డీపై 55% డిస్కౌంట్‌తో రూ.2,499కే విక్రయిస్తోంది. అలెక్సా వాయిస్ రిమోట్‌తో ఫైర్ టీవీ స్టిక్ లైట్ రూ.1,999కి లభిస్తోంది. అలెక్సా వాయిస్ రిమోట్‌తో ఫైర్ టీవీ స్టిక్‌ను రూ.4,499కు ప్రైమ్ డే సేల్‌లో విక్రయిస్తోంది. ఫైర్‌టీవీ బిల్ట్ ఇన్‌గా ఉన్న స్మార్ట్‌టీవీలపైనా 58 శాతం వరకు డిస్కౌంట్ పొందొచ్చని అమెజాన్ చెబుతోంది. షావోమీ 55 అంగుళాల స్మార్ట్‌టీవీ 44% డిస్కౌంట్‌తో రూ.38,999కు లభిస్తోంది. రెడ్‌మీ 32 అంగుళాల సిరీస్ హెచ్‌డీరెడీ స్మార్ట్ ఎల్‌ఈడీ టీవీ రూ.10,499కే లభిస్తుందని అమెజాన్ తెలిపింది. షావోమీ 32 అంగుళాల ఎఫ్ సిరీస్ హెచ్‌డీ రెడీ స్మార్ట్ ఎల్‌ఈడీ టీవీని రూ.10,999కి విక్రయిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సేల్‌లో ఎస్‌బీఐ, ఐసీఐసీఐ కార్డులతో కొనుగోలు చేస్తే 10 శాతం డిస్కౌంట్ పొందొచ్చు. ఈ సేల్ కేవలం ప్రైమ్ యూజర్లకు మాత్రమే.

## యూట్యూబ్‌లో 'ట్రెండింగ్' ట్యాబ్ ఇక మాయం

యూట్యూబ్ వాడే వారందరికీ 'ట్రెండింగ్' ట్యాబ్ సుపరిచితమే. ఆ ప్లాట్‌ఫామ్‌పై ఏవి ఎక్కువ పాపులర్ అవుతున్నాయో చూసేందుకు ఈ ట్యాబ్ ఉపయోగపడుతుంది. కేవలం ట్రెండింగ్‌లో ఉన్న వీడియోలు మాత్రమే చూసే అలవాటూ కొందరికి ఉంటుంది. కంటెంట్ క్రియేటర్లు కూడా తమ వీడియోలు ఎంత పాపులరయ్యాయో తెలిపేందుకు ఈ ట్యాబ్‌నే కొలమానంగా తీసుకుంటూ ఉంటారు. అలాంటి ట్రెండింగ్ సెక్షన్ త్వరలో కనుమరుగు కానుంది. మరికొన్ని వారాల్లో ఈ ట్యాబ్‌ను తొలగించనున్నట్లు యూట్యూబ్ అధికారికంగా ప్రకటించింది. ఈ ట్యాబ్‌ను ఎందుకు మూసివేస్తున్నదీ మాత్రం యూట్యూబ్ వెల్లడించలేదు. ట్రెండింగ్ ట్యాబ్‌లో సాధారణంగా పాపులర్ అయిన వైరల్ కంటెంట్, న్యూస్ హైలైట్స్, పాపులర్ మ్యూజిక్ ఆల్బమ్స్ దర్శనమిస్తుంటాయి. అయితే, ఇటీవల కాలంలో యూజర్ బిహేవియర్‌లో మార్పులు వచ్చాయి. పర్సనలైజ్డ్ రికమెండేషన్స్ కంటెంట్ పెరిగింది. యూజర్ ఎక్కువగా ఏతరహా కంటెంట్ చూస్తున్నారో వాటినే యూట్యూబ్ చూపిస్తోంది. ట్రెండింగ్‌లో ఉన్నవీ వారి హోమ్‌పేజీలో దర్శనమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రెండింగ్ అనే సెక్షన్ సెపరేట్‌గా అవసరం లేదని యూట్యూబ్ భావిస్తోంది. తద్వారా నావిగేషన్‌ను మరింత సులభతరం చేయాలనుకుంటోంది. 2015లో తొలుత ఈ ట్రెండింగ్ సెక్షన్‌ను పరిచయం చేసిన యూట్యూబ్.. గత ఐదేళ్లలో ఈ సెక్షన్‌కు రావాల్సిన ట్రాఫిక్ తగ్గడం గమనించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## ఆ ఫాస్టాగ్‌లు ఇక బ్లాక్‌లిస్ట్‌లోకి..

### జాతీయ రహదారుల సంస్థ కీలక నిర్ణయం


**దిల్లీ:** టోల్‌గేట్ల వద్ద సులభతర ప్రయాణం కోసం కొత్త టోల్ పాస్ విధానాలను తీసుకొస్తోన్న కేంద్రం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. 'లూజ్ ఫాస్టాగ్'ల విషయంలో కఠిన చర్యలకు ఉపక్రమించింది. అలాంటి ఫాస్టాగ్ యూజర్లను ఇకపై బ్లాక్‌లిస్ట్‌లోకి చేర్చనుంది. ఈ మేరకు జాతీయ రహదారుల సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. సాధారణంగా వాహనదారులు తమ ఫాస్టాగ్‌లను వాహన విండ్‌షీల్డ్‌లపై అతికించాలి. అప్పుడు టోల్‌ప్లాజాల వద్ద ఉన్న స్కానర్లు వాటిని స్కాన్ చేసేందుకు వీలుంటుంది. కానీ, కొందరు ఉద్దేశపూర్వకంగా ఫాస్టాగ్‌లను అతికించట్లేదు. టోల్ గేట్లు వచ్చినప్పుడు పర్సులో నుంచి తీసి చూపిస్తున్నారు. ఇలాంటి వాటినే 'లూజ్ ఫాస్టాగ్'గా పిలుస్తారు. ఇలాంటి యూజర్ల వల్ల టోల్ పాస్ నిర్వహణ సమస్యగా మారుతోందని, ప్లాజాల వద్ద రద్దీ పెరుగుతోందని ఎన్‌హెచ్‌ఏఐ తెలిపింది. అంతేగాక, కొందరు టోలింగ్ వ్యవస్థను దుర్వినియోగం చేసేందుకు యత్నిస్తున్నట్లు పేర్కొంది. అందుకే, వీటి కట్టడికి చర్యలు చేపట్టినట్లు జాతీయ రహదారుల సంస్థ తెలిపింది. లూజ్ ఫాస్టాగ్‌లను గుర్తించినప్పుడు సంబంధిత టోల్ కలెక్టింగ్ ఏజెన్సీలు వెంటనే దాన్ని రిపోర్ట్ చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ ఆదేశించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఈమెయిల్-ఐడీని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఆ రిపోర్ట్‌లను పరిశీలించిన తర్వాత.. సదరు ఫాస్టాగ్ యూజర్లను బ్లాక్‌లిస్ట్ జాబితాలో చేరుస్తామని స్పష్టం చేసింది. ఇటీవల జాతీయ రహదారులు(ఎన్‌హెచ్), జాతీయ ఎక్స్‌ప్రెస్‌వే(ఎన్‌ఈ)లపై వార్షిక ఫాస్టాగ్ టోల్‌పాస్ విధానాన్ని కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. రూ.3వేలతో ఫాస్టాగ్ టోల్‌పాస్ తీసుకునే కార్లు, జీపులు, వ్యాన్ల యజమానులు ఏడాదిపాటుగానీ, 200 ట్రిప్పుల వరకుగానీ జాతీయ రహదారులపై ప్రయాణించవచ్చని తెలిపింది. కొత్త విధానం వ్యక్తిగత కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే వర్తించనుంది. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి రానుంది.




## ఒక్క సెకన్‌లో నెట్‌ఫ్లిక్స్ డేటా మొత్తం డౌన్‌లోడ్..

### జపాన్‌లో 'బుల్లెట్' ఇంటర్నెట్..

మెరుపు వేగంతో దూసుకెళ్లే బుల్లెట్ రైళ్లు, అత్యుత్తమ ఎయిర్‌పోర్టులు, భూకంపాలను తట్టుకునే భవంతులు.. ఇలా అధునాతన సదుపాయాల్లో ముందుండే జపాన్ ఇప్పుడు మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఆ దేశ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సెకనకు 1.02 పెటాబిట్స్ స్పీడ్‌తో పనిచేసే ఈ ఇంటర్నెట్‌తో.. కేవలం రెప్ప మూసి తెరిచేలోపే నెట్‌ఫ్లిక్స్ లైబ్రరీలో ఉన్న డేటా మొత్తాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చుట..! అమెరికాలో ఉన్న సగటు ఇంటర్నెట్ కనెక్షన్ల కంటే ఇది 3.5 మిలియన్ రెట్ల వేగవంతమైన ఇంటర్నెట్ అని జపాన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇక భారత్‌లోని సగటు ఇంటర్నెట్ స్పీడ్‌తో పోలిస్తే దీని బ్రౌజింగ్, డౌన్‌లోడింగ్ వేగం 16 మిలియన్ రెట్లు ఎక్కువని తెలిపింది. ఎన్‌ఐసీటీలోని ఫొటోనిక్ నెట్‌వర్క్ లాబోరేటరీ టీమ్, సుమితోమో ఎలక్ట్రిక్ అండ్ యూరోపియన్ పార్ట్‌నర్స్‌తో కలిసి జపాన్ ఈ ఇంటర్నెట్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఇంటర్నెట్‌తో కేవలం ఒక్క సెకనులోనే ఇంగ్లీష్ వికీపీడియా మొత్తాన్ని 10వేల సార్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. సాధారణంగా ఈ వికీపీడియా స్టోరేజీ 100 జీబీ వరకు ఉంటుంది. ఇక, కొత్త ఇంటర్నెట్‌తో ఒక్క సెకనులోనే 8కే రిజల్యూషన్‌తో ఉన్న వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జపాన్ పరిశోధకులు చెబుతున్నారు. ప్రత్యేక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సాయంతో జపాన్ ఈ వేగవంతమైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం పరిశోధకులు ట్రాన్స్‌మీటర్లు, రిసీవర్లు, 19 లూపింగ్ సర్క్యూట్లను వినియోగించారు. ఈ లూపింగ్ సర్క్యూట్ ఒక్కోటి 86.1 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ లూప్స్ నుంచి సిగ్నళ్లు వెళ్లి డేటాను అందిస్తాయి. దీని సాయంతోనే సెకనుకు 1808 కిలోమీటర్ల దూరం వరకు డేటాను పంపించేందుకు వీలు లభిస్తుందని తెలిపింది. అయితే, ప్రస్తుతానికి ఈ ఇంటర్నెట్ గృహ వినియోగదారు లకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పించట్లేదు. కానీ, ప్రభుత్వాలు, డేటా సెంటర్ ఆపరేటర్లు, టెలికాం సంస్థలు దీన్ని వినియోగించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారట. 6జీ నెట్‌వర్క్, తర్వాతితరం సముద్రగర్భ కేబుళ్లకు ఈ జపాన్ ఇంటర్నెట్ ఓ మోడల్‌గా నిలవనుంది.



## 15న భారత్‌లో టెస్లా షోరూం ప్రారంభం

అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించడం ఖరారైంది. భారత్‌లో తమ కార్ల విక్రయాలు ప్రారంభించడానికి మస్క్ కంపెనీ జులై 15న ముంబయిలో తొలి షోరూం ప్రారంభించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ముంబయిలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో టెస్లా షోరూంను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఇందుకోసం ఇప్పటికే 5 వై మోడల్ కార్లు ముంబయికి చేరుకున్నట్లుగా జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. చైనాలోని షాంఘై నుంచి వాటిని తీసుకొచ్చినట్లు సమాచారం. అనంతరం దిల్లీలోనూ మరో షోరూం ఏర్పాటుచేయడానికి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు 2021 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం ఈవీలపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించాలని మస్క్ కంపెనీ డిమాండ్ చేసింది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. దేశీయంగా తయారీ ప్రారంభించడంతో పాటు ప్రాంతీయంగానే విడిభాగాలు కొనుగోలు చేయాలన్న షరతు పెట్టింది. ఇందుకు మస్క్ అభ్యంతరం వ్యక్తంచేయడంతో టెస్లా ఎంట్రీ ఆలస్యమవుతూ వచ్చింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు మస్క్ ఆయనతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సుంకాల అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఇటీవల 40వేల డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.34లక్షలు) కంటే ఎక్కువ ఖరీదైన హైఎండ్ కార్లపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని భారత్ తగ్గించింది. దీంతో భారత్‌లో టెస్లా ఎంట్రీకి మార్గం సుగమమయ్యింది. అయితే విద్యుత్తు వాహనాల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో షోరూమ్‌లు ఏర్పాటుచేసేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ.. దేశీయంగా కార్ల తయారీకి సుముఖంగా లేదని ఇటీవల కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి వెల్లడించారు.





## సెన్సెక్స్ 690 పాయింట్లు డౌన్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఓ వైపు టారిఫ్‌ల విషయంలో నెలకొన్న అనిశ్చితి... మరోవైపు ఐటీ షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకి పడేశాయి. టీసీఎస్ క్యూ1 ఫలితాలు మెప్పించకపోవడంతో ఐటీ షేర్లు నేడు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఆటోమొబైల్ షేర్లూ సూచీలపై ప్రభావం చూపా యి. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 700 పాయిట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 25,200 దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,820.76 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,190.28) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 82,442.25 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. 689. 81 పాయింట్ల నష్టంతో 82,500.47 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 205.40 పాయిం ట్ల నష్టంతో 25,149.85 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.80గా ఉంది.



# పెళ్లి అంటేనే భయమేస్తోంది

తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకుంటుంటారు నటి శ్రుతి హాసన్. మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించనున్న ఆమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. రజనీకాంత్‌తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. శ్రుతి పంచుకున్న విశేషాలు ఆమె మాటల్లోనే..

### అది జీవితకాలపు బాధ్యత..

"నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడిపెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవితకాలపు బాధ్యత"

### తొలి విజయాన్ని ఇచ్చిన టాలీవుడ్..

"పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్ సింగ్'లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలేనన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది"

### ఒకరితో ఒకరిని పోల్చలేం..

"మా నాన్న, రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీకి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టికోణంలోనే ఆయన నాకు తెలుసు. 'కూలీ' సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులు ఉన్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రజనీకాంత్.. వీరందరినీ ఒకరితో ఒకరిని పోల్చలేం" అని శ్రుతి వివరించారు.


# 18 నుంచి అమెజాన్ ప్రైమ్‌లోకి కుబేర




శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జులై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓటీటీ- విడుద లపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్బ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ఆ కల కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాల నుకుంటాడు. రూ.లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్‌లో.. మిగిలిన డబ్బు వైట్‌లో ఇవ్వాలని నీరజ్‌కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జు)ను బయటకు తీసుకొస్తాడు. ఈ పని కోసం దీపక్ బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడన్నది మిగిలిన కథ. శేఖర్ కమ్ముల మూవీ కావడంతో ఆసక్తి పెరిగింది. అయితే అనుకున్నంతగా ఇది సక్సెస్ సాధించలేదన్నది వేరు విషయం.

# షూటింగ్‌లో యంగ్ బ్యూటీ


యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్న వరుస చిత్రాల్లో 'ఆంధ్రా కింగ్ తాలుకా ఒకటి. హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ మహేష్ బాబు పి కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ మూవీకి సంబంధించి లేటెస్ట్ అప్డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో స్టార్ట్ అయినట్లు తెలుస్తోంది. ఈ షూటింగ్‌లో భాగ్యశ్రీ బోర్సేతో పాటు రామ్ పోతునేని కూడా జాయిన్ అయినట్లు తెలుస్తోంది. ఇర వీరిద్దరి మధ్య కొన్ని కీలక సన్నివేశాలతో పాటు రావు రమేష్‌లపై సీన్స్ చిత్రీకరిస్తున్నారట మేకర్స్. తాజాగా మొదలైన ఈ షూటింగ్ మరో ముప్పై రోజుల పాటు జరగనుందని సమాచారం. ఇక ఈ చివరి షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ పూర్తవనుండగా. త్వరలో ప్రమోషన్స్ స్టార్ట్ చేయనున్నారు టీమ్.



# రామాయణ'.. హనుమంతుడి పాత్ర 15 నిమిషాలే

బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారి రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. ఇటీవల ఇందులోని పాత్రలను పరిచయం చేస్తూ వీడియోను విడుదల చేయగా దానికి మంచి ఆదరణ లభించింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో హనుమంతుడి పాత్రలో బాలీవుడ్ నటుడు సన్నీ దేవోల్ కనిపించనున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రెండు పార్టులుగా రానున్న ఈ సినిమా మొదటిభాగంలో ఆయన పాత్ర నిడివి చాలా తక్కువగా ఉండనున్నట్లు సమాచారం. 15 నిమిషాలు మాత్రమే కనిపిస్తారట. రెండో భాగంలో ఆయన పాత్రే కీలకం కానున్నట్లు తెలుస్తోంది. పార్ట్ 2లో ఎక్కువసేపు కనిపించనున్నారట. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ ఈ వార్త మాత్రం సోషల్ మీడియాలో షేర్ అవుతోంది. ఇందులో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. జఠాయువు పాత్రకు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ వాయిస్ ఓవర్ ఇవ్వనున్నట్లు సమాచారం. శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమా మొదటిభాగం వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకురానుంది. రెండో భాగం 2027లో విడుదల కానుంది.





# రేణూదేశాయ్ సర్జరీ గురించి నెట్టింట ఆసక్తి

2009లో పవన్ కల్యాణ్‌ను ప్రేమ వివాహం చేసుకున్న రేణు దేశాయ్, అకీరా నందన్, ఆద్య అనే ఇద్దరు పిల్లలకు తల్లయ్యారు. 2012లో వీరి వివాహ బంధానికి బీటలు వారాయి.. విడాకుల అనంతరం రేణు సినిమాలకు కూడా దూరమయ్యారు. అప్పటినుంచి తల్లిగా తన పాత్రను పోషిస్తూ పిల్లలకే ప్రత్యేక సమయం కేటాయించారు. అయితే రేణూ దేశాయ్‌కి సంబంధించిన ఓ వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. రేణూ దేశాయ్ తాజాగా తన ఇన్‌స్టా స్టోరీలో కూతురు ఆద్యతో దిగిన పిక్ షేర్ చేస్తూ.. సర్జరీ తర్వాత నా ముద్దుల కూతురితో కలిసి డిన్నర్ డేట్‌కి బయటకు వెళ్లాను అంటూ క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ పోస్ట్ తర్వాత రేణూ దేశాయ్‌కి సర్జరీ జరగడమేంటి, ఆమెకు ఏమైందని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఇక రేణూ దేశాయ్ దాదాపు 20 ఏళ్ల విరామం తర్వాత రవితేజ నటించిన 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాలో నటించారు. హేమలత లవణం పాత్రలో కనిపించినా.. ఆ సినిమా ఫెయిల్ కావడంతో ఆమె మళ్లీ సినిమాలపై ఆసక్తి చూపడం లేదు. రేణు దేశాయ్ ఇప్పుడు జంతు హక్కుల కోసం పోరాడుతున్న ప్రముఖ సామాజిక కార్యకర్తగా మారారు. మూగజీవాల సంక్షేమానికి సొంతగా ఎన్జీవో కూడా ప్రారంభించారు. ఈ సంస్థకు ఉపాసన కొణిదెల అంబులెన్స్ సదుపాయం అందించడం విశేషం. ఇక ఇదిలా ఉంటే రేణ ఇటీవల రెండో పెళ్లిపై ఓపెన్ అయింది. అకీరా, ఆద్యే నన్ను పెళ్లి చేసుకోమని ప్రోత్సహిస్తున్నారు. నువ్వు ఎవరితో హ్యాపీగా ఉంటావో వాళ్లని పెళ్లి చేసుకో అంటున్నారు. మరో రెండేళ్లో నా పిల్లలకి పూర్తి అవగాహన వస్తుంది. అప్పుడు తప్పకుండా ఓ వ్యక్తిని పెళ్లి చేసుకుంటానని పేర్కొంది రేణూ.



# సాయిపల్లవి సీతకి సరిపోదంటూ విమర్శలు

ఇండియన్ సినిమా హిస్టరీలో భారీ బడ్జెట్ తో రాబోతోంది రామాయణ మూవీ. రణ్ బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా, సాయిపల్లవి సీతగా కనిపిస్తున్నారు. నితేష్ తివారీ డైరెక్షన్ లో వస్తోంది. దాదాపు రూ.900 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను బాలీవుడ్ నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ సాయిపల్లవిని పనిగట్టుకుని కొందరు నార్త్ యూట్యూబ్ ఛానెళ్లు, కొందరు బాలీవుడ్ మీడియా వాళ్లు ట్రోల్స్ చేస్తున్నారు. సాయిపల్లవి సీత పాత్రకు సరిపోదంటూ తెగ పోస్టులు పెడుతున్నారు. కాజల్ రావణుడి భార్యగా, రకుల్ శూర్పనకగా నటిస్తున్నారంటూ ఒక ప్రచారం అయితే నడుస్తోంది. దీంతో కాజల్ లాంటి అందమైన భార్య ఉండగా రావణుడు అందంగా లేని సాయిపల్లవి కోసం పరితపించడం ఏంటని వెకిలి పోస్టులు పెట్టేస్తున్నారు. పైగా గో వధ చేసే వారిపై గతంలో సాయిపల్లవి సానుభూతి చూపించింది కాబట్టి ఆమెను సీత పాత్రకు తీసుకోవడం ఏంటని ట్రోల్స్ చేస్తున్నారు. కానీ సాయిపల్లవి సీత పాత్రకు న్యాయం చేస్తుందని ఆమె ఫ్యాన్స్ అంటున్నారు. ఎందుకంటే సీతమ్మ పాత్రలో చేయాలంటే అద్భుతమైన నటన వచ్చి ఉండాలని.. అది సాయిపల్లవికే ఉందంటున్నారు. పైగా ఇతర హీరోయిన్లలాగా సాయిపల్లవి ఎలాంటి ఎక్స్ పోజింగ్, బోల్డ్ పాత్రలు చేయలేదని.. కాజల్, రకుల్ అలాంటి పాత్రలు చేశారని చెబుతున్నారు. సీతమ్మ పాత్రలో చేయడానికి ఉండాల్సిన అన్ని అర్హతలు సాయిపల్లవికి ఉన్నాయంటున్నారు. అందం ముఖ్యం కాదని.. అభినయమే ముఖ్యం అంటూ ఆమెకు మద్దతు ఇస్తూ నార్త్ మీడియాను ఏకి పారేస్తున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com